**ప్రొద్దుటూరు, జులై 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన పాలన అందిస్తూ ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనిత మున్సిపల్ శాఖా మంత్రి మరియు జిల్లా మంత్రి ఆదిమూలపు సురేష్‌లు పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో స్థానికఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మరియు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నాడు ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి అనేక సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటీర్లను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పారదర్శకంగా నేరుగా ఇంటి ముంగిటకే చేర్చిన ఘనత సిఎం జగన్‌కేదక్కుతుందన్నారు. రాష్ట్రం ≫2

# చైనా అధ్యక్షుడిని కలిసిన 100 యేళ్ల అమెరికా మిత్రుడు

5లో

వార్త

నీ స్నేహితుల్ని నువ్వు చులకన చేయకు. అలానే నీవు కూడా వారికి చులకన అవ్వకు.

-పుల్లర్

# ప్రశ్నపత్రాల వ్యాపారం!

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. కష్టపడకుండా తెల్లవారే సరికి లక్ష్మీపుత్రులై కోట్లకు పడగెత్తాలనే కొందరి దురాశ అన్ని రంగాలతోపాటు విద్యా రంగంలో పెచ్చరిల్లుతుండడంతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇంకొకపక్క ఉద్యోగాలకు జరిగే పరీక్షాపత్రాలు కూడా లీక్ కావడంతో లక్షలాది మంది నిరుద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని, ప్రశ్నపత్రాలు సంపాదించుకొని, పరీక్షల్లో కొందరు విద్యార్థులు, ఉద్యోగార్థులు అందలం ఎక్కిపోతుంటే దళారులు కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. వాల్యూయేషన్‌లో మార్కులు వేయించుకొని కొందరు, ఏకంగా జవాబుపత్రాలనే మార్చివేసే ప్రయత్నంలో మరికొందరు ఇలాఎవరికి ఎక్కడవీలైతే అక్కడ అక్రమాలకు పాల్పడేందుకు ఆరాటపడుతుండడంతో రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటున్న విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈ పరీక్షలు, ఆ పరీక్షలు అనికాదు దేశవ్యాప్తంగా ఎన్నో పరీక్షా ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్న విషయం వెలుగు చూసింది. గత ఏడెనిమిదేళ్లలో దేశవ్యాప్తంగా డెబ్బైకి పైగా లీకేజీలు కావడంతో దాదాపు కోటిన్నరమంది విద్యార్థులు, నిరుద్యోగులు బాధితులైనట్లు అంచనావేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక పరీక్షలకు సంబంధించి రాజస్థాన్‌లో గత దశాబ్దకాలంలో ఇరవైఆరుసార్లు ప్రశ్నపత్రాలు కొందరు దళారులు అమ్ముకున్నట్లు వెలుగుచూసింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో పోటీ పరీక్షాపత్రాలు ఎన్నో లీక్‌అయ్యాయి. తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ టిఎస్‌పిఎస్‌సిలో పనిచేసే కొందరు ఉద్యోగులే పరీక్షాపత్రాలను అమ్ముకున్నారనే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు నాలుగున్నర లక్షల మందికిపైగా హాజరైన గ్రూప్-1 ప్రిలిమ్స్, ఎఈ, ఎఈఈ, డిపిఒ తదితర పరీక్షలు ప్రభుత్వం రద్దుచేసి తిరిగి పరీక్షలు నిర్వహించాల్సి వచ్చింది. ఆదిలో ఈ ప్రశ్నపత్రాల లీక్ కొందరికే పరిమితమైందని భావించినా దర్యాప్తు సంస్థలు తవ్వేకొద్ది విస్తరిస్తున్నది. ఇప్పటివరకు దాదాపు వంద మందినిపైగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో లోతుకువెళ్లే కొద్దీ ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. విదేశాల్లో ఉన్నవారు కూడా ఈ ప్రశ్నపత్రాలు అందుకొని పరీక్షలు రాసేందుకే అక్కడ నుండి వచ్చి రాసివెళ్లారంటే ఎంతవరకు వెళ్లిందో ఊహించుకోవచ్చు. ఈ పరీక్షాపత్రాల వ్యాపారంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. ఇవేకాదు రైల్వే రిక్రూట్‌మెంట్‌కు సంబం ధించిన ప్రశ్నపత్రాలు లీక్ అయిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇక విద్యార్థుల భవిష్యత్‌కు కీలకమైన ఎంసెట్ పరీక్షాపత్రాలు ఎన్నిసార్లు లీక్ అయ్యాయో చెప్పలేం. నిరుద్యోగులకు సంబంధించిన అనేక ప్రశ్న పత్రాలు లీక్ అవుతున్నాయి. అయితే ఇవి లీక్ అయినట్టు వెలుగుచూస్తున్న సందర్భాల్లోనే ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం, రద్దుచేయడం లాంటివి చేస్తున్నది. ఎంతోమంది నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతున్నది. ఏ పార్టీ అధికారంలోఉన్నా, ఎవరు పాలనాపగ్గాలు చేపట్టినా ఈ పరీక్షల నిర్వహణలోమాత్రం అవకతవకలు నివారించలేకపోతున్నారు. ప్రశ్నపత్రాలు లీక్‌అయి బయటపడకుండా ఉంటే ఆ ప్రశ్నపత్రాలు కొన్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాల జవాబులను కంఠస్తం చేసిన ప్రబుద్ధులు ఎలాంటి కష్టం లేకుండా ఉద్యోగాలు సంపాదించుకుని పైకివెళ్లిపోతుంటే సంవత్సరాల తరబడి శ్రద్ధాశక్తులతో కష్టపడి చదివిన మెరికల్లాంటి విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. చదువే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషిచేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ గురించి ఆలోచిస్తే హృదయం ద్రవించక తప్పదు. నిత్య అధ్యయనంతో విజ్ఞానం ఆర్జించి పరిశోధనతో మేధాసంపత్తిని పెంచుకోవాల్సిన విద్యావిధానండబ్బుతో కొనుక్కునే స్థాయికి దిగజారడం అత్యంత దురదృష్టకరం. పరీక్షల్లోఅక్రమాలు విద్యారంగ ప్రమాణాలతోపాటు దేశాభివృద్ధికి కూడా గండి కొడుతున్నాయనేది కాదనలేని వాస్తవం. ఇందుకు దళారులను మరెవరినో నిందించేకంటే పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించలేని పాలకపెద్దలను తప్పుపట్టాలి. తమకళ్ల ముందే కొందరు దళారులు అతిస్వల్పకాలంలో కోట్లకు పడగెత్తడం చూసి ఆ ఉన్నతి తాము కూడా సాధించాలనే ఆశ పెరగడం సహజం. ఆ ఆశ అత్యాశగామారి దురాశగా రూపాంతరం చెందినప్పుడు ఇలాంటి అక్రమాలకు అదుపు ఉండదు. అందుకే వారిని విమర్శించేకంటే ముందు ఈ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు వేలాది రూపాయల జీతం తీసుకుంటున్న అధికారులను నిలదీయాలి. ప్రభుత్వం కళ్లుతెరిచి ఈ దోపిడీని అరికట్టేందుకు నడుం కట్టాలి. అన్ని పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి. అక్రమాలకు బాధ్యులైన వారిని ఉద్యోగాల నుంచి తొలగించడమేకాకుం డా క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. వారి ఫొటోలను పత్రికలకు, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రచురించి ప్రజలకు తెలియచేయాలి. ప్రభుత్వం అంతకఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో పరీక్షాపత్రాలు కొని అందలమెక్కాలనుకునే ఆశపడేవారికి, ప్రశ్నపత్రాల వ్యాపారంచేసేవారికి భయం ఉండదు. రాత్రికిరాత్రే ఈ పరీక్షాపత్రాల వ్యాపారంలో కుబేరులు కావాలనుకునే దళారుల దురాశలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ప్రశ్నపత్రాల తయారీ, వాటి భద్రత, పరీక్ష నిర్వహణకు సంబంధించి పటిష్టమైన వ్యవస్థను రూపొందించడంతోపాటు విస్పష్ట విధివిధానాలు కూడా రూపొందించాలి.

పరికరాలు తుప్పుపట్టినట్లే మనసు కూడా తుప్పుపడుతుంది. అశ్రద్ధ చేయబడిన తోట కలుపుతో నిండినట్లే అశ్రద్ధ చేయబడిన సామర్థ్యం వాడి నశిస్తుంది.



ఎథెల్ ఆర్‌పజ్

ప్రదేశం, పరిస్థితులు గాక, మనసు ఒక్కటే మానవునికి ఆనందాన్ని కాని, బాధలను కాని తెస్తుంది.



లా ఎస్ట్రేంజ్

## ప్రజావాక్కు



### ధరలను తగ్గించండి

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఠారెత్తిస్తున్నాయి. కూరగాయల ధరలు అయితే కొండెక్కి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు ఏమి కొనలేని, తినలేని పరిస్థితి ఏర్పడింది. బియ్యంనుంచి పప్పుల వరకూ అన్ని ధరలు అమాంతం పెరిగిపోవడంతో వంటింటికి ఆ సెగ తగులుతోంది. సంపాదించిన మొత్తం కూరగాయలు, నిత్యావసరాలకే వెచ్చించాల్సి వస్తుండడంతో రోజు గడవడమే కష్టంగా మారుతోంది. ఇకరోజువారి కూలీల పరిస్థితి మరింత దారుణంగా మారింది. మధ్యతరగతి వారి సంపాదన అంతా ఇల్లు గడవడానికే సరిపోతుండగా, ఇక పిల్లలచదువులు, వైద్యం ఖర్చులకు ప్రతి నెలా వారు అప్పులు చేయాల్సివస్తోంది. రైతు బజారులు సగంఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లద్వారా కూరగాయలు, నిత్యావసర సరుకులు విక్రయించడంతోపాటు ఇష్టారాజ్యంగా ధరలుపెంచేస్తున్న వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భయప్రదర్శన

జాతీయస్థాయిలో వివిధపార్టీలు రెండు గ్రూపులుగా భయప్రదర్శన చేయడం తాజావార్త. ఎదుటి వారిదే భయప్రదర్శన, తమది మాత్రం బలనిరూపణ అనిఎవరికి వారు అనుకోవచ్చు. కాగా ఇరువురిదీ ఒకే తరహా ప్రదర్శన. అయితే ఎక్కువ భయం ఎన్డీయేది కావొచ్చు. ఎందుకంటే 2019 నుండివారు ఇంతవరకూ ఇలా కలిసి గ్రూప్ ఫొటో దిగిందే లేదు. ఎంతసేపూ బిజెపి సోలో పర్ఫార్మెన్స్ కనబడింది. ఎంతమంది వస్తారో రండి మేం ఒంటిచేత్తో ఎదిరిస్తాం తరహాసూపర్ హీరో డైలాగులే ఉండేవి. ఇప్పుడు ఏకాయెకి 38 పార్టీలు అన్నీ కలిసి ఒకే చోట. ఇక రెండో భయప్రదర్శన ప్రతిపక్షాల గ్రూపుది. 26 పార్టీలు కలిసి రెండోసారి బెంగళూరులో కలిశాయి.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### మొక్కలు నాటాలి

ప్రస్తుతంప్రపంచ జనాభావిపరీతంగా పెరిగిపోయింది. జనాభా పెరిగిపోవడంవల్ల నివాసాలు, పంటపొలాలు ఏర్పాటు చేసుకోవడానికి, విలువైన ఖనిజాల కోసం గనుల తవ్వకం మానవుడు తన స్వార్థం కోసం, విలాసాల కోసం చెట్లను నరికి వేయడం వలన అడవులు కుదించుకుపోతున్నాయి. ఇలాంటి అనర్థాలు జరగకముందే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా కనీసం ఒక్కొక్కరు వంద మొక్కలైన నాటాలి.

-సురేష్, ఖానాపురం, కర్నూలు

### ఉపాధ్యాయుల సమస్యలు తీర్చండి

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్నాయి. నూతన పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలి. ఐఆర్ ప్రకటించాలి. పెండింగ్ డీఏలను విడుదల చేయాలి. బదలీలు, ప్రమోషన్లు వెంటనేకల్పించాలి. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలి. 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను ఒకేసారి కాకున్నా, కనీసం దశలవారీగానైనా సరే స్థానిక జిల్లాల బదలీకి ఉత్తర్వులు జారీ చేయాలి. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలుచేయాలి. సంపాదిత సెలవుల నగదు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పిల్లలఫీజురాయితీ, జిపిఎఫ్ అడ్వాన్సులు, పాక్షిక విత్‌డ్రాయల్స్ తదితర బిల్లులు నెలలు దాటినా శాంక్షన్ కావడం లేదు. ఈ-కుబేర్‌లో బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే మంజూరు చేయాలి. నగదు రహితవైద్యం అందించేందుకు జారీచేసిన హెల్త్‌కార్డ్స్ ఎందుకూ పనికి రాకుండాపోయాయి. ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-పిన్నింటి బాలాజీరావు, హనుమకొండ

### జెండా.. అజెండా!

తెలంగాణ రాష్ట్రంలోని 119నియోజకవర్గాలకు 2024లో ఎన్నికలుజరగనున్నాయి. రాష్ట్రంలోఉన్న జాతీయస్థాయి రాజకీయ పార్టీలు, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు రాబోయే ప్రభుత్వం మాదంటే మాదని అంచనా వేసుకుంటున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి అభ్యర్థుల కోసం ఆయా పార్టీల ప్రణాళికలు అజెండాలు రూపొందిస్తున్నాయి. కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకితీసుకుని అందులో కొంత మంది దగ్గరనుంచి మేనిఫెస్టోలు రూపొందిస్తున్నాయి. పాత సంక్షేమ పథకాలను సమీక్షిస్తూ కొన్నింటిని రద్దు చేస్తూ మరికొన్నింటిని మారుస్తూ రూపొందిస్తున్నాయి.

-ఈదునూరి మహేష్, వరంగల్‌జిల్లా

### మహిళలకు రక్షణ ఏది?

రాష్ట్రంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు లైంగికదాడులు, కిడ్నాప్‌లు, యాసిడ్‌దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా దళిత, గిరిజన బలహీన వర్గాలకు చెందిన మహిళలెన్నో అవమానాలకు గురవుతున్నారు. అధికార పార్టీకే చెందిన దళిత, గిరిజన మహిళా సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు వివక్షకు గురవుతున్నారు. మరోవైపు తగినంత మంది పోలీసు సిబ్బంది లేక నేరాలను అదుపుచేయడం, నేరస్తులను పట్టుకొని శిక్షించడం కష్టమైపోతున్నది.

-ఎన్.రఘురామ్, నల్గొండజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# సాంకేతిక నైపుణ్య శిక్షణతోనే అభివృద్ధి సాధ్యం!

చైనా ఈరకంగా అమెరికా, బ్రిటన్, వంటి దేశాలను అధిగమించి అగ్రపథాన పరుగులు పెడుతుంది అంటే కారణం సాంకేతికపరమైన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడం వల్లనే. జపాన్‌కి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ప్రకృతి ప్రకోపానికి విలవిల్లాడినా కదురుకుని నిలబడిదంటే కారణం ఆ దేశం సాంకేతికతతో కూడిన నైపుణ్యాలను పాఠశాల దశనుండే అన్వయం చేస్తూ విద్యా బోధన చేస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి హామీదొరకని వారిని గుర్తించి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించాలి. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ఉండటానికి ప్రయత్నం చేస్తూ మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా యువతకి శిక్షణను అందించగలిగితే భారత్ అగ్రపథాన దూసుకెళ్లడం ఖాయం.

గంప శ్రీనివాస్

ఏ దేశమైనా అభివృద్ధి పథంలో పయనించాలంటే ఆ దేశం ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి సాధించాలి. దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే యువత అన్ని రంగాలలో ముందు ఉండాలి. యువకులు అందివచ్చిన అవకాశాలను పుణికిపుచ్చుకుని, దేశాభివృద్ధిలో పాలుపంచుకున్నప్పుడు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది అనేది నిర్వివాదాంశం. యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసి తద్వారా స్వయం సమృద్ధి, సాధికారత కల్పించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ అంశాన్ని గుర్తించాలని సూచించింది. నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకునేందుకు యువకులకు శిక్షణ కల్పించి ప్రోత్సాహకాలు కల్పించాలని సూచించింది. ఈ అంశానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన భారతదేశం సైతం అందుకు అనుగుణంగా అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. 2023 సంవత్సరానికి గాను 'పరివర్తనాత్మక భవిష్యత్తు కోసం నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, శిక్షకులు, యువతను' అను నేపథ్య అంశంతో ముందుకు రావడం జరిగింది. యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులలో, శిక్షకులలో మార్పు తీసుకురావాలని భావించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. కొవిడ్ అనంతర పరిణామాల్లో భాగంగా యువతకి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన అనే కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రదేశాలలో ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాలను ఏర్పాటు చేసి నైపుణ్యాలను అభివృద్ధి పరిచేందుకు శిక్షణను ఇస్తుంది. దేశంలోని 37 నైపుణ్య రంగ సంస్థలు, 33 జాతీయ నైపుణ్యశిక్షణా కేంద్రాలు, సుమారు 15వేల ఐటిఐలు యువతలో నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థలో నమోదు చేసుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. అందరికీ సరైన ఉపాధి అవకాశాలను కల్పించి తద్వారా ఉత్పాదకతను పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పైలట్ ప్రాజెక్ట్ దశలో 8 రాష్ట్రాల్లో 13 పారిశ్రామిక క్లస్టర్‌లను ఏర్పాటు చేసి తద్వారా అప్రెంటిషిప్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 13,394 మంది అధికారులకు శిక్షణ ఇచ్చింది. కర్మయోగి ప్రారంభ్ పోర్టల్ ద్వారా నూతనంగా విధుల్లో చేరిన వారికి వృత్తిపరమైన నైపుణ్యాలు వృద్ధి చేసేందుకు సుమారుగా 400 ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. జమ్మూకాశ్మీర్‌లోని యువత ఉపాధి లేకపోతే తీవ్రవాదం పెరుగుతుందని భావించి ఉడాన్ పథకం ద్వారా పారిశ్రామిక నైపుణ్యాలను వృద్ధి చేయడానికి కేంద్రహోంశాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌డిసి కృషి చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా జమ్మూకాశ్మీర్‌లో అనతికాలంలోనే 24వేల ఉద్యోగాలను కల్పించారు. ఐఐఎంసిల ద్వారా ప్రపంచవ్యాప్తంగా కార్మికుల కొరతను గుర్తించి అసంఘటిత రంగాలలోని కార్మికులకు శిక్షణ ఇప్పించి ఒమన్, యూఏఈ, ఖతార్ వంటి దేశాలలో ఉపాధి కల్పించడం జరుగుతుంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా అనేక అంకుర సంస్థలకు అంకుర్పారణ జరిగి విశేషమైన ఉత్పాదకత పెరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి టాస్క్ తెలంగాణ అకాడెమీ ఫర్‌స్కిల్ అండ్ నాలెడ్జ్ అనే కార్య



క్రమం ద్వారా యువతకి నైపుణ్యాలను అభివృద్ధి పరిచే కార్యక్రమానికి 2014లో శ్రీకారం చుట్టి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. తెలంగాణ ఎంటర్‌పెన్యూర్షిప్ అనే ప్రోగ్రాంను ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, టాస్క్ కలిసి నిర్వహిస్తూ యువతలో నైపుణ్యాలు అభివృద్ధి చేయడానికి వారు అంకుర సంస్థలు ఏర్పాటు చేసుకోవడానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. మార్కెట్‌లో ఒకవైపు ఉద్యోగాలకు పోటీ పెరుగుతోంది. మరోవైపు పారిశ్రామిక రంగాన్ని నైపుణ్యాల లేమి వెన్నాడుతోంది. ఈ నేపథ్యంలో డిగ్రీ చదువుతున్న యువత ప్రత్యేక నైపుణ్యాలను సొంతం చేసుకోవడానికి ప్రభుత్వం కొత్త కోర్సులు ప్రవేశపెట్టింది. యువతకు కొలువులు దక్కకపోవడానికి కారణం విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం లేమితోపాటు అనుభవపూర్వక అభ్యసనం లేకపోవడమేనని వివిధ సర్వేల్లో వెల్లడయింది. ఈ లోపాలను సరిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వంలోని పలు సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లతో కలిసి విద్యాశాఖ ఈసారి అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు మూడు రోజులు కళాశాలలో తరగతులకు హాజరవుతారు. మరో మూడు రోజులు ఆ విద్యాసంస్థతో అనుసంధానమైన పరిశ్రమలు, స్టోర్లు, కార్యాలయాల్లో పని చేస్తారు. దీనికి స్టయిఫండ్‌గా నెలకు ఏడువేల నుంచి పదివేల వరకు చెల్లిస్తారు. ఈ కోర్సులకు అనుగుణంగా ప్రత్యేక సిలబస్‌ను రూపొందిస్తున్నారు. మొత్తం 103 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఈ కోర్సులకు అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించగా తొలి విడత నాటికి 39 కళాశాలలే ముందుకు వచ్చాయి. రెండో విడతకు మరికొన్ని పెరగగా మూడో విడతకు వాటి సంఖ్య 64కు పెరిగింది. అందులో ఓయు పరిధిలోనే 33 కళాశాలలు ఉండగా వాటిలో 19 ప్రైవేట్ కళాశాలలున్నాయి. అయితే భారతదేశం దేశవాళి మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అవకాశాలను మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనాఉంది. యువరక్తంతో తొణికిసలాడుతూ ఉరకలేస్తున్న యువత భారత్ విశ్వావ్యాప్తంగా ఉన్న డిమాండ్‌కి అనుగుణంగా ముందుకు వెళ్లాలి. యువత వల్లే దేశఅభివృద్ధి సాధ్యపడుతుంది. యువత నైపుణ్యాలు వృద్ధి చేసుకుని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు వెళితే దేశ పురోగతికి దోహదపడుతుంది. భారత దేశం నైపుణ్యాలను విశేషమైన రీతిలో అభివృద్ధి చేసుకుంటే దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించి సంపన్న దేశాల సరసన నిలవడానికి ఎంతోకాలం పట్టదు. అయితే ఇంకా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశం నైపుణ్యాల వృద్ధి విషయంలో ఇంకా పురోగతి సాధించాలి. ఇది మన విద్యావిధానంలో భాగమవ్వాలి. వృత్తివిద్యా కోర్సులను పాఠశాల విద్యలోనే సమ్మిళితం చేయాలి. మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్స్‌ని పాఠశాల విద్యతోనే అందించాలి. సృజనాత్మకతతో కూడిన ఆలోచనలతో ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించి వారు పరిశ్రమలు నెలకొల్పేలా ప్రోత్సహించాలి. చిన్న చిన్న దేశాలు సైతం నైపుణ్య శిక్షణ ద్వారా ఏ విధంగా ముందుకు వెళ్తున్నాయి అనేది గమనిస్తే మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ఆ దిశగా సరైనస్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందని అనిపిస్తుంది. నేడు చైనా ఈ రకంగా అమెరికా, బ్రిటన్, వంటి దేశాలను అధిగమించి అగ్రపథాన పరుగులు పెడుతుంది అంటే కారణం సాంకేతికపరమైన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడం వల్లనే. జపాన్‌కి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ప్రకృతి ప్రకోపానికి విలవిల్లాడినా కదురుకుని నిలబడిదంటే కారణం ఆ దేశం సాంకేతికతతో కూడిన నైపుణ్యాలను పాఠశాల దశ నుండే అన్వయం చేస్తూ విద్యాబోధన చేస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి హామీ దొరకని వారిని గుర్తించి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించాలి. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ఉండటానికి ప్రయత్నం చేస్తూ మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా యువతకి శిక్షణను అందించగలిగితే భారత్ అగ్రపథాన దూసుకెళ్లడం ఖాయం. ●

# రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆగేదెప్పుడు?

కనుమ ఎల్లారెడ్డి

దాదాపు సంవత్సరకాలం నుండి రష్యా, ఉక్రెయిన్ దేశాలు పట్టు వీడటం లేదు. ప్రతీకారజ్వాలలు రేగుతూనే ఉన్నాయి. రెండు దేశాల మధ్య సయోధ్య అనే మాటే వినబడడం లేదు. శాంతికి అన్ని దారులు మూసుకుపోయాయి. ఈ దిశలో ఉక్రెయిన్ తాజాగా వేర్చ్ వంతెనను పేల్చివేసింది. వంతెన పాక్షికంగా దెబ్బతినింది. గతంలో కూడా ఉక్రెయిన్, రష్యా నల్ల సముద్రంపై నిర్మించిన రైలువంతెనను పేల్చివేసినట్లు సమాచారం. దీనికి ప్రతిగా రష్యా, ఉక్రెయిన్‌లోని పలు పట్టణాలను ధ్వంసం చేసింది. వేర్చ్ వంతెనను పేల్చివేసిన ఉక్రెయిన్ చాలా సాహసంతో వ్యవహరించింది. అమెరికా, బ్రిటన్ దేశాల సాయంతో, ఆ దేశాల ఒత్తిడితో ఉక్రెయిన్ ఈ పని చేసి ఉంటుందని భోగట్ట. ఇలా ఈ వంతెనపై దాడి జరగడం ఇది రెండవసారి. అందుకే రష్యా అక్కడ భారీ భద్రతను పెంచింది. అయినా దాడి జరగడం గమనార్హం. ఈ దాడికి రష్యా స్పందించింది. ప్రస్తుతం ఈ వంతెనపై ఎటువంటి రాకపోకలు జరగడం లేదని పేర్కొంది. అసలు వంతెన దెబ్బతినిందా? లేదా అనేది ఇక్కడ ప్రశ్న. రష్యా ఎంతో ప్రతిష్టాకరంగా భావించే ఈ వంతెనను అమెరికా, బ్రిటన్ దేశాలు ఉక్రెయిన్‌కు సాయం అందించడంతో రెండు భారీ పేలుళ్లు జరిగినట్లు తెలుస్తోంది. రష్యా అనుమానించినట్లుగా ఈ కుట్రలో ఉక్రెయిన్‌తోపాటు అమెరికా, బ్రిటన్ హస్తం కూడా ఉన్నట్లు భావిస్తుంది. వంతెన దెబ్బతినడం మా విజయం అని ఉక్రెయిన్ చెబుతోంది. ఇలా రష్యా, ఉక్రెయిన్ తమ శక్తి సామర్థ్యాలూ తెలుపుకుంటున్నాయి. యుద్ధం ఆగిపోవాలని వాళ్లు కోరుకోవడం లేదు. ఉక్రెయిన్ ఎటూ 'నాటో'లో చేరడం లేదు. చేరడానికి దరఖాస్తు చేసింది అంతే. ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్రెయిన్‌కు అవకాశం ఉండదు. దీనిని రష్యా గమనిస్తే చాలు. అంతేకాని ఎందుకీ దాడులు ప్రజాస్వామ్యవాదులు సంధించే ప్రశ్న ఇది. అమెరికా, బ్రిటన్



దేశాల సహకారంతోనే ఉక్రెయిన్ ఈ దాడిచేసిందని తెలుస్తోంది. అందు నిమిత్తమే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యా నరమేధానికి ఇది పరాకాష్ఠ అని వ్యాఖ్యానించాడు. రష్యా మాపై చేస్తున్న దాడులన్నీ క్రూరమైనవే అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇలా దాడులు, ప్రతిదాడులు చేసుకుంటూ ఉంటే ఇక యుద్ధం ఎలా ఆగుతుంది. యుద్ధం ఆపాలనే టర్కీ చాలా తహతహలాడుతోంది. కాని ఇది ఇంకా ఉధృతం అయ్యే విధంగా ఉంది. ఇప్పుడు ఏదేశం కూడా రష్యా, ఉక్రెయిన్‌కు చెప్పే సాహసం చేయవు. ఎందుకంటే గతంలో మాదిరి ఇప్పుడు పరిస్థితులు లేవు. రష్యా ఇంకా పేట్రేగిపోవచ్చు. రెండు దేశాలకు అసలు యుద్ధం ఆపాలి అనే ధ్యాసే లేదు. ఏవో కొన్నిదేశాలు మాత్రమే యుద్ధం ఆగాలి అని కోరుకుంటున్నాయి. ఒకవేళ యుద్ధం ఆగితే అది కలలోమాటే. ఇక్కడ మనకు ఇటలీ నియంత ముస్సోలిని చెప్పినమాట గుర్తుకువస్తోంది. ఆయన చెప్పినట్లు ప్రపంచ శాంతి పిచ్చి వాని కల' అన్నది నూటికి నూరుపాళ్లు నిజం. ఇప్పుడు విశ్వంలో ఏ దేశం శాంతిగాఉంది? ప్రతిదేశం అభద్రత భావంతోనే ఉన్నాయి. దేశాలమధ్య సఖ్యత కూడా కొరవడుతోంది. ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు. రేపు మరోయుద్ధం కావొచ్చు. ఇక శాంతి ఎక్కడ? అంతా అశాంతే. ఇటువంటి పరిణామాలు ఏర్పడినప్పుడు దేశాలు ఎలాప్రగతి సాధిస్తాయి? ఎలా ఆర్థిక స్థిరత్వం సాగిస్తాయి? రష్యా, ఉక్రెయిన్ దేశాలకు మానవతా దృక్పథమే లేదు. ఒకదాన్ని మించి మరొకటి దాడులు, ప్రతిదాడులతో రెచ్చిపోతున్నాయి. ఉక్రెయిన్ ఇంతలా ధైర్యంగా దాడులు చేయడం అంటే అమెరికా, బ్రిటన్ దేశాలు చేస్తున్న సహాయమే. లేకపోతే ఏనాడో రష్యాది పైచేయి అయ్యేది. దరిమిలా యుద్ధం ఆగి ఉండేది. నాటోలో చేరం మా దేశ రక్షణ ఇక రష్యా చూసుకుంటుందని జెలెన్‌స్కీ ప్రకటన చేసిఉంటే రష్యాకు అంగీకారమై ఉండేది. నిజానికి ఇక్కడ యుద్ధం ఇంకా కొనసాగుతుంది అనుకుంటే అది అమెరికా చలువే. ప్రస్తుతం కనుచూపు మేరలో యుద్ధం ఆగిపోయే పరిస్థితి లేదు. పైహెచ్చుదాడులు ప్రతిదాడులతో రెండు దేశాలు చెలరేగవచ్చు. ●

# ఆన్‌లైన్ మోసాలను అరికట్టలేరా?

డి.జె మోహనరావు

ఎప్పుడైతే బ్యాంకింగ్ రంగం డిజిటలీకరణ జరిగిందో ఖాతాదారులు నగదు లావాదేవీలు ఇంటి నుండే జరుపుతున్నారు. ఇవన్నీ తక్కువ కాలంలోనే జరగడం వలన ఎక్కువ ఖాతాదారులు ఆన్‌లైన్‌లో నగదు కార్యకలాపాలు చేయడం అలవాటు చేసుకున్నారు. ఇక కొవిడ్ పరిస్థితుల్లో చాలా మంది ఆన్‌లైన్ వైపే మొగ్గుచూపారు. ఇదే అదునుగా చాలా మంది మోసగాళ్లు ఖాతాదారులను మోసం చేసి మన నగదును మనకు తెలియకుండా కాజేస్తున్నారు. ఒక వ్యక్తి బ్యాంకు ఖాతా నుండి ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా డబ్బులు దొంగలించడాన్నే ఆన్‌లైన్ మోసం అని చెప్పొచ్చు. మోసగాళ్లు రకరకాల పద్ధతులను అనుసరించి డబ్బులను కాజేస్తారు. నకిలీ క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యుపిఐల ద్వారా ప్రధానంగా మోసాలు జరుగుతున్నాయి. ఎటియం యంత్రాలలోకి పాడ్ కనిపించేలా చిన్న రహస్య కెమెరాను అమర్చి మనం పిన్‌ను నమోదు చేసినప్పుడు పసిగట్టి స్కిమ్మింగ్ పద్ధతిలో నకిలీ ఎటియం కార్డులను తయారు చేసి ఖాతా నుండి నగదును తీయడం లేదా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా షాపింగ్ చేసుకుంటారు. బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్ సిమ్‌ని స్వైపింగ్ లేదా క్లోనింగ్ చేసి నకిలీ సిమ్‌ని పొంది ఓటిపిలు వచ్చేటట్లు చేసుకొని ఖాతాలోని నగదును కొల్లగొడతారు. ఫిషింగ్ అంటే బ్యాంకు లేదా ఈ కామర్స్ సైట్‌లను పోలిన వెబ్ సైట్‌లను రూపొందించి వీటిని వినియోగించేటప్పుడు వాటి ద్వారా ఖాతాదారుని వివరాలు తెలుసుకొని మోసానికి పాల్పడతారు. విషింగ్ పద్ధతి ఉపయోగించి ఇంకా బ్యాంకుల నుండి అధికారుల మాదిరిగా ఫోన్ చేసి కార్డ్ బ్లాక్ అయిందో, ఇ-కెవైసి చేయాలనో, వినియోగదారుల కార్డుల వివరాలు, పిన్ నెంబరులను తెలుసుకొని ఓటిపిల ద్వారా ఖాతాలోని నగదును ఖాళీ చేస్తారు. ఇప్పుడు అందరూ ఎక్కువగా రకరకాల యుపిఐల ద్వారా బ్యాంకు లావాదేవీలు చేస్తున్నారు. మోసగాళ్లు దొంగ క్యూఆర్‌లను ఫోన్లకు పంపించి దాని ద్వారా అకౌంట్‌లోని డబ్బులను తీస్తున్నారు. మన ఖాతాకు ఎంతో కొంత నగదును పంపించి పొరపాటుగా వచ్చేసిందని, ఆ నగదును యుపిఐ ద్వారా తిరిగి పంపమని ప్రాధేయపడతారు. ఇది నిజమే అనుకొని వారి ఖాతాకు నగదును తిరిగి పంపుతారు. ఇదే అదనుగా మోసగాళ్లు వారి పని వారు కానిస్తారు. అలాగే కొన్ని సంస్థలు లేదా టోల్‌ఫ్రీ నంబర్‌ను తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో శోధిస్తారు. మోసగాళ్లు ముందుగానే మనం వెతుకుతున్న నంబర్లకు బదులుగా నకిలీ ఫోన్ నంబర్లను ఉంచుతారు. వినియోగదారుడు ఆ నెంబర్ యథార్థమైనదేనని నమ్మి కాల్ చేస్తే తనదైన శైలిలో మోసగాళ్లు నగదును మాయం చేసేస్తారు. ప్రతీ ఒక్కరూ ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు వాడుతున్నారు. ఇదే అదనుగా మన స్నేహితుడు మాదిరిగానే అత్యంత అవసరం



ఉందని కొంత మొత్తాన్ని అప్పు కావాలని నమ్మబలుకుతారు. మనం నమ్మి ఆన్‌లైన్‌లో నగదును పంపిస్తే ఇక అంతే. ఇంకా వ్యక్తిగత ఫొటోలను అసభ్యకరంగా మార్పులు చేసి బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. కొంత మంది యువత అసభ్యకరమైన వెబ్‌సైట్లను చూస్తారు. అప్పుడు ఆ వెబ్‌సైట్ నుండి కొన్ని రకాల మాల్వేర్లను వారి వ్యక్తిగత మొబైల్ లేదా కంప్యూటర్‌లోకి చొప్పిస్తారు. అది ఇక అక్కడే తిష్ట వేసి వ్యక్తిగత సమాచారాన్ని లేదా ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ చేసేటప్పుడు సమాచారాన్ని మోసగాళ్లకు చేరవేస్తుంది. వారు ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలు దొంగలించి నగదును కాజేస్తారు. తక్కువ రేటుకే కొన్ని రకాలైన వస్తువులు విక్రయిస్తానని మన ఫోన్లకు యస్‌ఎమ్‌ఎస్ లేదా ఈమెయిల్‌కు లింక్‌లను పంపుతారు. ఇది క్లిక్ చేయగానే మన అకౌంట్లో డబ్బులు తీసేసుకుంటారు. గేమ్స్, అశ్లీల యాప్‌లను లింకుల ద్వారా డౌన్‌లోడ్ చేసేటప్పుడు మన బ్యాంకింగ్ వివరాలను తస్కరించి ఖాతాలను ఖాళీ చేస్తారు. ఇక లాటరీ వచ్చిందని, రీఛార్జ్ ఉచితమని, పెట్రోల్, ఉచితమని రకరకాలైన సందేశాన్ని పంపించి అవి క్లిక్ చేయగానే వారి పని వారు చేస్తారు. ఇక మనకు మిగిలింది జీరో అకౌంట్ మాత్రమే. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలంటే ఖాతాదారులు ముందుగానే అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వం ఇలాంటి సమస్యలపై ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలి. గ్రామాల్లో నివసిస్తున్నవారికి ఇలాంటి మోసాలపై ఎక్కువగా అవగాహన ఉండదు. వారికి ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ఎలా పరిష్కరించుకోవాలోఅవగాహన కార్యక్రమాల ద్వారా తెలియచేయాలి. బ్యాంకులో ఖాతా తెరిచినప్పుడే బ్యాంకు అధికారులు కూడా ఇటువంటి మోసాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేయాలి. గ్రామాల్లోని యువత ఎక్కువగా ఫోన్ ఉపయోగిస్తూ గేమ్స్ ఆడుతూ ఉంటారు. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా కూడా ఖాతాల్లో ఉన్న డబ్బులు ఖాజేస్తారు. ఇలా డబ్బులు పోగొట్టుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఎటియంలలో నగదు తీసేటప్పుడు రహస్య పిన్‌ను ఎవరికీ కనిపించకుండా కీబోర్డుపై ఒత్తాలి. శివారు ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల నుండి కాక జనావాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఎటియంల నుండి నగదును తీసుకోవాలి. అనుమానితులు ఉంటే అక్కడ నగదు తీసుకోకూడదు. ఏ ఒక్క బ్యాంకు అధికారి కాల్ చేసి ఖాతాకు సంబంధించిన వివరాలు అడగరు. అలాగే మనకు వచ్చే ఓటిపిలు ఎవరితో చెప్పకూడదు. ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసేటప్పుడు బ్యాంకుకి సంబంధించిన వెబ్‌సైట్ మాత్రమే ఉపయోగించాలి. ఆన్‌లైన్ ఫోన్ నంబర్లను నమ్మకూడదు. అనుమానిత లింక్లను తెరవకూడదు. యుపిఐలతో జాగ్రత్తగా లావాదేవీలు చేయాలి. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారాన్ని ఫొటోలను ఉంచకూడదు. అసభ్యకరమైన సైట్‌లను తెరువకూడదు. ఉచితాలని, లాటరీలని నమ్మకూడదు. ఇంట్లో ఉండే చిన్న పిల్లలకు ఫోన్ ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మొబైల్‌ని లాక్ చేసుకోవాలి. ఇక ఏదైనా అక్రమ లావాదేవీలు జరిగితే వెంటనే బ్యాంకుకు ఫోన్ చేసి తెలపాలి. ●







# అమలాపురం వెంకన్న హుండీ లెక్కింపు



**అమలాపురం, జులై 20, (ప్రభాతవార్త):** అమలాపురంలో వేంచేసి యున్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడులు హుండీ ఆదాయం రూ14 లక్షల 36 వేల198ల ఆదాయం చేకూరింది. ముమ్మిడివరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ పీకే. లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. భక్తులు హుండీలో సమర్పించిన ముడుపుల నుంచి ఈ ఆదాయం వచ్చింది. గత ఏడాది వచ్చిన ఆదాయం కంటే ఈ ఏడాది రెట్టింపు వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి దునబోయిన సాయిబాబు అన్నారు. గురువారం జరిగిన హుండీ లెక్కింపుల్లో కేవలం 90 రోజుల్లో వచ్చిందని ఇవి కాకుండా స్వామివారి కానుకలు, అన్నదానం, ప్రసాదం వచ్చే విరాళాలు అదనంగా వస్తున్నాయని అన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో చైర్ పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, దూడల ఫణి, ధర్మకర్తలి మండలి సభ్యులు, సేవాసమితి సభ్యులు,అర్చకులు, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఉరకలెత్తుతున్న గోదావరి

**- బ్యారేజి 175 గేట్లు 1.500 మీ. మేర ఎత్తివేత - సముద్రంలోకి 4 లక్షల 29 వేల క్యూసెక్కుల నీరు విడుదల - ఎగువ ప్రాంతాల్లో నెమ్మదిగా పెరుగుతూ వస్తోన్న వరద**



ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఉరక లెత్తుతున్న గోదావరి నది

**ధవళేశ్వరం, జులై 20, (ప్రభాతవార్త):** అల్పపీడన ప్రభావంతో అఖండ గోదావరి ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉప్పొంగుతోంది. గత రెండు రోజుల నుంచి నదిలో నీటిమట్టాలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం గురువారం ఉదయం ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లను ఒకటిన్నర మీటర్లు పైకి ఎత్తి నాలుగు లక్షల, ఇరవై తొమ్మిది వేల, రెండు వందల నలభై ఎనిమిది క్యూసెక్కుల వరద అదనపు జలాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గోదావరికి వరద మొదలై ఉప్పొంగుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమై ఉమ్మడి తూర్పు, పశ్చిమ జిల్లాల ఇరిగేషన్, రెవెన్యూ ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి లోతట్టు గ్రామాల ప్రజలకు పునరావాసం ఏర్పాటు చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించవలసిందిగా ఆదేశించింది. ఇక గత ఏడాది ఇదే రోజున గోదావరికి వరద పోటెత్తి మూడు ప్రమాద హెచ్చరికలు దాటి డేంజర్ లెవెల్లో 17 లక్షల 152 క్యూసెక్కులు ప్రవహిస్తూ అనేక గ్రామాలను ముంచెత్తింది. వాతావరణ శాఖ రాబోయే 48 గంటలలో నదీ పరివాహక ప్రాంతాలలో అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేయడం వల్ల గోదావరి ఎగువ భద్రాచలంలో ప్రస్తుతం ఉన్న 43 అడుగుల నీటిమట్టం మరి కాస్త పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 53 అడుగులకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇదే కాకుండా గోదారి ఉపనదులు అయిన శబరి, ఇంద్రావతి, పెన్ గంగా ప్రాణహిత, ఉపనదులకు కూడా వరద సంభవిస్తుండటం వల్ల ఆయా నదులపై ఉన్న శ్రీరాంసాగర్, సింగూరు, కడెం, తదితర ప్రాజెక్టులు నీటితో నిండి జలకళ సంతరించుకుంటున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 33 వేల యాభైవేల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 14,140 క్యూసెక్కులు వరద ప్రవహిస్తుండగా, కిన్నెరసాని డ్యాం నిండటంతో గేట్లు పూర్తిగా ఎత్తివేయడంతో నాలుగు లక్షల 85 వేల క్యూసెక్కుల వరద అఖండ గోదావరిలో కలుస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. అవేకాకుండా వేలేరుపాడు కుకునూరు, మండలాల మధ్య రహదారులు నీట మునగడంతో సుమారు 23 గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. ఇక పోలవరం వద్ద ప్రాజెక్టు 48 గేట్లు పూర్తిగా ఎత్తివేసి వరదను క్రిందకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ నీటి నిల్వ సామర్థ్యం కేవలం 2.837 మీ. కావడంతో వరదల సీజన్ మొత్తానికి 1800 టీఎంసీల నీరు సముద్రంలోకి వృధాగా కలిసిపోతోంది. గోదావరి ఎగువ కాళేశ్వరంలో గత 24 గంటలలో నది నీటిమట్టం 8.25 0 నుంచి 9.4 9 0 మీ. పేరూరులో 13.150 నుంచి 14.810 లకు, భద్రాచలంలో 24. 5 మీటర్ల నుంచి 32.50 మీటర్ల వరకు నది నీటిమట్టలు పెరుగుతూ వస్తున్నాయి. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద డెల్టా కాలవలకు 13 వేల క్యుసెక్కులు విడుదల చేస్తున్నారు. గోదావరి బ్యారేజ్ వద్ద మూడు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

**పశువుల వైద్య సేవలు సంచార వాహనాలు 1962 టోల్ ఫ్రీ నెంబర్‌ను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ డా. కే.మాధవీలత**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జులై 20, (ప్రభాతవార్త):** జిల్లాలో గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించే విధంగా వారి ఆరోగ్యంపై దృష్టిని సారించి రోజువారీ ఆహారంలో విటమిన్లు సమృద్ధిగా ఉండేలా వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత స్పష్టం చేశారు. గురువారం వెలపూడిలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, రీసర్వే, భూసేకర, వ్యవసాయం, జగనన్న పాలవెల్లువ, హౌసింగ్, ప్రాధాన్యతా భవనాలు, ఎన్ఆర్ ఈజిఎస్, జెకేసీ ద్వారా చేపట్టి అమలు చేస్తున్న లక్ష్యాల పురోగతి పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు హాజరయ్యారు. సిఎస్ కే.ఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా అమలు చేస్తున్న విద్య, వైద్యం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జెకేసి, రీసర్వే, హౌసింగ్ వంటి పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో లక్ష్యసాధన అందేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా కె.మాధవీలత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న 10-19 సం.రం.ల వయస్సు కౌమార దశలో వున్న 41445 మంది బాలికలు ఉండగా ఇందులో 41035 మందికి పరీక్షలు నిర్వహించి తేలికపాటి, మోస్తరు, అధికంగా రక్తహీనత లోపం వున్న బాలికలకు గోరుముద్ద, వైఎస్ఆర్ సంపూర్ణ పౌష్టికారం అందిస్తున్నామన్నారు. అదేవిధంగా 25-49 సంవత్సరాల వయస్సు మధ్య గల 3538 మంది గర్భిణీ స్త్రీలను వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత లోపం వున్న 860 మందికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. 6 సంవత్సరంలలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలను 2483 మందిని గుర్తించి వైఎస్ఆర్ సంపూర్ణ పోషకారాన్ని అందిస్తున్నామన్నారు. 6 సం.రం.లోపు బలహీనంగా పిల్లను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రీసర్వేలో భాగంగా 51 గ్రామాలకు గాను 14 గ్రామాలు ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తిచేయడం జరిగిందని మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం క్రింద జూలై 19 నాటికి 296 అర్జీలు పరిష్కరిచాల్సి ఉండగా నిర్దేశించిన గడువులోపు నూరు శాతం పరిస్కరించడం జరిగిందన్నారు. జిల్లాలో 68,519 గృహనిర్మాణాలు లక్ష్యానికి గాను గతవారం చివరి నాటికి 18554 పూర్తి చేయడం జరిగిందని, మిగిలినవి వివిధ దశల్లో వున్నాయని వివరించారు. గృహనిర్మాణ లబ్ధిదారులకు ఎస్ జి హెచ్ రుణాలు మంజూరులో 64,488 మందికి గాను 49,468 మందికి మంజూరు చేసామన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన 23,866 ఇళ్లకు విద్యుత్, 13,937 ఇళ్లకు నీటి సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రధానమంత్రి కిసాన్ ఈ కే వై సీ ఆధార్ అథెంటికేషన్ ప్రక్రియలో భాగంగా 97,089 నమోదు చేసామని ఇంకా 11,103 నమోదు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో కిసాన్ డ్రోన్ ఫైలట్ శిక్షణకు సంబంధించి 20 లక్ష్యనికి గాను ఇప్పుయి వరకు 17 మందికి శిక్షణ అందించామన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లో ఫేజ్ -1 నాడు నేడు కింద చేపట్టిన పనుల నిర్వహణ తీరు, ఫేజ్ 2 పనుల తీరును పరిశీలించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్, మరుగుదొడ్లు, త్రాగునీరు వంటి వాటి నిర్వహణ అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంపై ఆదేశాలు జారీ చేస్తూ ప్రతి రోజు ఉదయం టెలి కాన్ఫరెన్స్ (మిగతా 6వ పేజీలో)

# మెడికవర్ బిఎంటి సేవలు అభినందనీయం : కలెక్టర్ కృతిక శుక్లా



**కాకినాడ రూరల్, జులై 20, (ప్రభాతవార్త):** ఉభయ గోదావరి జిల్లాల్లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌ని పూర్తిగా ఆరోగ్యశ్రీ పథకంలో చేసి క్యాన్సర్ రోగి ప్రాణాలను కాపాడిన కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బందిని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ అచ్చంపేట జంక్షన్ సమీపంలో మెడికవర్ హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా క్యాన్సర్ వ్యాధికి పూర్తి ఉచితంగా బిఎమ్‌టి సేవలు అందుబాటులో ఉన్నాయని వీటిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. క్యాన్సర్‌కు చికిత్స విజయవంతంగా నిర్వహించినందుకు హాస్పిటల్ హెడ్ సిద్ధారెడ్డి, వైద్యులు మురళీధర్‌ను, ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రభుత్వ సేవలు సులభంగా అందించేందుకే జగనన్న సురక్ష: శాసనసభ్యులు పర్వత

**శంఖవరం, జులై 20, (ప్రభాతవార్త):** ప్రభుత్వం అందిస్తున్న సేవలను సులభంగా పొందేందుకు జగనన్న సురక్ష ఎంతగానో దోహదపడుతుందని శాసనసభ్యులు పర్వత ప్రసాద్ స్పష్టం చేశారు. శంఖవరంలో గల ఆయన స్వగృహంలో గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రజలకు ఏ విధమైన సేవలు అందించాలో తెలిసిన ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థలోని వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రతిపక్షాలు వాలంటీర్ వ్యవస్థ పై బురదజల్లే కార్యక్రమాన్ని మానుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఏనభై వేల మంది వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు అని వారిలో డబ్బై శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. జగన్ చెప్పాడంటే చేస్తాడని, రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలపై ఇతర రాష్ట్రాలు దృష్టి సారించాయని ఆయన పేర్కొన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత ప్రామాణికంగా సేవలందిస్తున్న ప్రభుత్వం వైసిపి అన్నారు.

# చురుగ్గా సిఎం రాక ఏర్పాట్లు



**అమలాపురం, జులై 20, (ప్రభాతవార్త):** ఈనెల 26వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలాపురం పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జిఎంసి బాలయోగి స్టేడియం నందు స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులను బటన్ నొక్కి జమ చేయనున్న నేపథ్యంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా స్థాయి అధికారులను ఇప్పటికే ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులు విస్తృతంగా పర్యటిస్తూ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, భారీ కేడింగులు ఏర్పాటు, వీఐపీ, ప్రెస్ గ్యాలరీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి దిగేందుకు ఆర్డీవో కార్యాలయం వెనుక నున్న పోలీస్ గ్రౌండ్ ను ఎంపిక చేసి హెలిపేడ్‌ను సిద్ధం చేస్తున్నారు.వేదిక వద్దకు రానుపోను మార్గాలను నిశితంగా పరిశీలించి ఆ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

# తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారిత : టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి



**కొత్తపేట, జులై 20, (ప్రభాతవార్త):** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు రక్షణ కరువైపోయిందని, మహిళలపై దాడులు, అరాచకాలు, అత్యాచారాలు ఎక్కువైపోయాయని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ధ్వజమెత్తారు. గురువారం ఆమె మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితను టార్గెట్ చేస్తూ వైసీపీ నాయకులు అవలంబిస్తున్న విధానాలు, మహిళలను చులకన భావంతో మాట్లాడటం మహిళల పట్ల వారికున్న గౌరవాన్ని తెలియజేస్తున్నాయన్నారు మహిళలకు సముచిత స్థానం, గౌరవం కల్పించింది తెలుగుదేశం పార్టీయే అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని, చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాలు అమలులోకి తెచ్చారని అన్నారు. ప్రభుత్వ శాఖలన్నిటిలో అభివృద్ధి కోసం చేసే ఖర్చులో మూడవ వంతు మహిళల కోసం ఖర్చు చేయాలన్న నిబంధన పెట్టారంటే మహిళాభ్యుదయం పట్ల చంద్రబాబుకు ఎంతటి నిబద్ధత ఉండేదో అర్థం చేసుకోవచ్చున్నారు. తాజాగా మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టోలో మహిళల కోసం మహాశక్తి పథకాన్ని పొందుపరిచారని, ఈ పథకం ద్వారా మహిళలకు మరింత లబ్ధి చేకూరనుందని అన్నారు. మహాశక్తి పథకం ద్వారా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 నుంచి 59 లోపు ప్రతి స్త్రీకి నెలకు రూ.1,500 జమ చేయనున్నారన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని జిల్లాలో మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారని చెప్పారు. ఈ పథకాల ద్వారా మహిళల పట్ల చంద్రబాబుకి ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తాయన్నారు. మహిళలకు రక్షణ లేని ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని మహిళ సంక్షేమం కోసం పాటుపడే చంద్రన్న రాజ్యం కోసం మహిళలు అందరూ ఎదురు చూస్తున్నారని ఆమె అన్నారు.

# సీఎం రాక ఏర్పాట్లలో ఉద్యోగులు



**అమలాపురం రూరల్, జులై 20, (ప్రభాతవార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 26వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రానున్న దృష్ట్యా స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో సీఎం రాక ఏర్పాట్లలో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఒక వైపున పంచాయితీ ఉద్యోగులు శానిటేషన్ కార్యక్రమాలు చేస్తుంటే మరోవైపున మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు జంగిల్ క్లియరెన్స్ తొలగిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారిణి కృష్ణకుమారి ఆదేశాల మేరకు ఈవోపిఆర్డీ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది కలసి శానిటేషన్ పనులను చేయిస్తున్నారు. అలాగే 22 గ్రామాలకు సంబంధించిన సుమారు 250 మంది ఉపాధి కూలీలు కలిసి బాలయోగి స్టేడియంలో పేరుకుపోయిన జంగిల్స్ ను తొలగిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శివకుమారి గత కొద్ది రోజుల నుండి టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూనే ఉపాధి కూలీలతో జంగిల్స్‌ను తొలగింప చేయిస్తున్నారు. సీఎం జగన్ రాకను పురస్కరించుకుని గత నాలుగు రోజుల నుండి పంచాయితీ ఉద్యోగుల తోపాటు ఉపాధి కూలీలు కూడా ఆయా పనుల్లో బిజీ బిజీ అయ్యారు. చివరకు అలసి సేద తీరిన దృశ్యాలు కెమెరాకు చిక్కాయి.

## వినాయకుని హుండి ఆదాయం రూ. 21,31,347లు

**అయినవిల్లి, జులై 20, (ప్రభాతవార్త):** ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారి హూండీల ఆదాయాన్ని ఆలయ పర్యవేక్షణ అధికారి జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. 56 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ.20,43,118 లు, అన్నప్రసాదం హుండీల నుండి నగదు రూ.88,229లు వెరసి మొత్తం రూ..21,31,347లు లభించినట్లు ఈఓ సత్యనారాయణ రాజు తెలిపారు.కాగా బంగారం 42 గ్రాములు,వెండి 1083 గ్రాములు విదేశీ నోట్లు 38 వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ శ్రీ నంబూరి వెంకటరమణ రాజు, ధర్మకర్తలి సభ్యులు కొత్త విజయ భాస్కర రామారావు, కె.సత్యనారాయణ, బి.ఎన్.మూర్తి, బి.దుర్గాదేవి, రెడ్డి గనిరాజు, ఎం.దుర్గ, అడపా సుధారాణి, కె.సత్యవతి, అర్చక స్వాములు, గ్రామస్థులు, సేవాదళ సభ్యులు, దేవస్థానము సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది
### మండల వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య



**గండేపల్లి, జులై 20, (ప్రభాతవార్త):** కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మండల వైద్య అధికారిణి డాక్టర్ సౌమ్య అన్నారు. గురువారం జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ చలగళ్ళ దొరబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని లెప్రసీ చికిత్స పూర్తయిన పాత కేసులకు రెండు జతల ఎంసిఆర్ (మైక్రో సెల్యులర్ రబ్బరు) చెప్పులు, ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుత్తుల లలిత, లెప్రసీ నోడల్ ఆఫీసర్ పి సి హెచ్ వీర్రాజు, హెల్త్ సూపర్వైజర్ చెల్లారావు, ఫార్మసిస్ట్ హిమావతి, స్టాఫ్ నర్స్ జాస్మిన్, ల్యాబ్ టెక్నీషియన్ నాగార్జున, ఎమ్ పి హెచ్ ఎ లు దుర్గాప్రసాద్, జయ బాబు, సత్తార్, ఏఎన్ఎంలు వెంకటలక్ష్మి, హేమలత మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటా సర్వేలో రౌతులపూడికి ప్రథమ స్థానం



**రౌతులపూడి, జులై 20, (ప్రభాతవార్త):** జగనన్న సురక్ష పథకంలో అందించే 11 రకాల సేవలకు వాలంటీర్లు నిర్వహించిన ఇంటింటా సర్వేలో జిల్లాస్థాయిలో రౌతులపూడి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎం డి ఓ ఎం గోవిందు తెలిపారు. గురువారం రౌతులపూడి గ్రామ సచివాలయం టూ యందు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 116 11 ఇళ్లకు గాను 9647 ఇళ్లకు వెళ్లి జగనన్న సురక్ష పథకంపై వాలంటీర్లు అవగాహన కల్పించారన్నారు. జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపిన ఎండిఓ ఎం. గోవిందుకు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటారి అర్జమ్మ, ఉ ప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కర బాబు, జడ్పిటిసి గొల్లు చిన్నది వాణం, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, ఇన్చార్జి ఇ ఓ పి ఆర్ డి. జే వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నదికి పెరిగిన వరద ఉధృతి



**పి. గన్నవరం, జులై 20, (ప్రభాతవార్త):** గోదావరి నదికి వరద ఉధృతి పెరగడంతో పి.గన్నవరం మండలంలోని లంక గ్రామాలైన గంటి పెదపూడి లంక, ఊడిమూడి లంక, బూరుగులంక, అరిగెలవారిపేట ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు గోదావరి నదిపై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక బాటలు బుధవారం రాత్రి వరద నీటి వలన కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ నేపథ్యంలో వారు నిత్యవసరాల కోసం నాటు పడవలపై రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ పరిస్థితులలో అధికార యంత్రాంగం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాల మేరకు హుటాహుటిన లంక గ్రామాల ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా వరద సహాయక చర్యలు చేపడుతుంది. అదేవిధంగా మండలంలోని యర్రం శెట్టి వారి పాలెం శివారు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే అన్నగారి లంక, పెదమల్లంక లంక గ్రామాలకు యర్రంశెట్టి వారి పాలెం వద్ద ఉన్న తాత్కాలిక బాట సైతం కొట్టుకుపోవడంతో ఆ గ్రామాల ప్రజలకు కూడా రాకపోకలు సాగించేందుకు పడవలపై వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది. వాకలి పాలెం శివారు కనకాయలంక కాజ్వే వరద ఉధృతి మరింత పెరిగితే మునిగిపోయే అవకాశం ఉంది.

# జగనన్న సురక్షకు అపూర్వ స్పందన : మంత్రి విశ్వరూప్



**ముమ్మిడివరం, జులై 20, (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. ముమ్మిడివరం వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులందరికీ పూర్తి స్థాయిలో అందజేయడానికి గత 20 రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ఊహించిన దానికంటే స్పందన అధికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వారికి అవసరమైన కుల ఆదాయ ధృవీకరణ పత్రాలు తో పాటు రేషన్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ప్రజల నుండి విశేష స్పందన వస్తుందన్నారు. ఇప్పటికి 87 శాతం ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని, మిగిలిన వారు పథకాలను అందుకోవాలన్నారు. దీని కోసం వాలంటీర్లు గృహ సర్వే ద్వారా పథకాలు అందని వారిని గుర్తించి అందించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 378 జగనన్న సురక్ష కార్యక్రమ సభలు జరిగాయని, వీటి ద్వారా 4లక్షల 28 వేల 823 గృహదారులకు 5 లక్షల 7వేల 128 మందికి వివిధ రకాల సర్టిఫికెట్స్ అందించడం జరిగిందన్నారు. 50 నుండి 100 రూపాయలు ఖర్చు అయ్యే సర్టిఫికెట్లను ఉచితంగా వాలంటీర్ల ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 27వరకు సురక్ష కార్యక్రమం జరగనుందని వీటిలో భూ సమస్యలకు పరిష్కారానికి జిల్లా యంత్రాంగం రూపొందించిన ఎంపిడిఓ, ఈఓఆర్డీ, తహశీల్దార్ టీమ్ లు పని చేస్తున్నాయన్నారు. పెన్షన్ జనవరి నుండి 3000 చేసి అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే నాడు-నేడు, అమ్మఒడి, ఇంగ్లీష్ మీడియం, విద్యా కానుక, రైతు భరోసా, చేయూత, జగన్ను తోడు పథకాలు పొందిన ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా ప్రభుత్వానికి బ్రహ్మారథం పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీలు ఏకమౌతున్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ప్రజలపై నమ్మకంతో మేము ఒంటరిగానే పోటీకి వెళ్తామన్నారు. వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రంగం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందన్నారు. ఈ సమావేశంలో పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వాసంశెట్టి శ్రీనివాసరావు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ జెడ్పిటిసి సభ్యుడు కుడిపూడి శివ శంకర రావు పెనుమచ్చ చిట్టిరాజు కోలా బాబ్జి లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై సమీక్షే జగనన్న సురక్ష : ఒమ్మి రఘురామ్

**జగ్గంపేట, జులై 20, (ప్రభాతవార్త):** ప్రభుత్వం ప్రజలకు చిత్తశుద్ధితో అభివృద్ధి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తోందని, ఆ మేలు ఏ మేరకు అందుతుందో సమీక్ష చేసుకోవడమే జగనన్న సురక్ష అని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలు అందకుండా ఉండకూడదని జగనన్న సంకల్పం అని వైఎస్ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామచంద్రాపురం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ అన్నారు. గురువారం జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామములో గ్రామ సర్పంచ్ జగతం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీఓ వసంతకుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో బాధ్యతగా పనిచేసి ప్రజల సమస్యలు సురక్షాలో నమోదు చేయాలన్నారు. జగ్గంపేట తహశీల్దార్ బూసి శ్రీదేవి మాట్లాడుతూ అన్ని రకాల సమస్యలతో పరిష్కారంతో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు, వివిధ సర్టిఫికెట్స్ జారీతో పాటు కౌలు కార్డుల జారీ, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఈ శిబిరంలో 531 వివిధ రకాల ధ్రువపత్రాలు జారీ చేశారు. రఘురామ్ మాట్లాడుతూ జగనన్న పేదల పక్షాన నిలబడి మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక



విమర్శలు చేస్తున్నాయని, సచివాలయ, వాలంటీర్ల మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని సభకు వివరించారు. జగన్మోహన్ రెడ్డి బల పరచవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు, అభివృద్ధిలో భాగంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మాణాలు మల్లిసాలలో జరిగాయన్నారు. రామవరం మల్లిసాల రోడ్డు పనులు అతి త్వరలోనే జ్యోతుల చంటిబాబు గారి ద్వారా పూర్తి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మల్లిసాల ఎంపీటీసీ పైల శివరామకృష్ణ, గ్రామ వై సీ పీ నాయకులు సతీష్, గ్రామ వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశు సంబంధ వైద్య చికిత్సలకు సంబంధించి 1962 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రైతులు, పశు పోషకులు పశు సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి రెండు చొప్పున పశువుల అంబులెన్సులను 1962 ను అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందన్నారు. నెలనెలా వీటి నిర్వహణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం జరుగుతున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత భవనాలకు చెంది నిర్మాణం పూర్తి అయిన భవనాలకు చెంది ఫ్లోరింగ్, ఫినిషింగ్, విద్యుత్ తదితర అంశాలపై వారం వారం లక్ష్యాల సాధనకు మండలాల వారీగా సమీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో జి. నరసింహులు, ఆర్డిఓ ఏ.చైత్రవర్షిణి, ఆర్డబ్ల్యు ఎస్. ఈ డి.బాల శంకరరావు, పంచాయతీ రాజ్ ఎస్ ఈ ఎవిబి ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.ఎన్.వసుంధర, హౌసింగ్ పిడి పరశురామ్, పి డి.. డిఆర్డిఏ శుభాషిణి, సీపీఓ, డి ఏ ఓ. ఎస్.మాధవరావు, డిపి హెచ్ ఓ.. ఎస్ జి టి సత్య గోవిందం, పి డి. ఐసీడీఎస్.. కే. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ మేలు చేయడమే సురక్ష లక్ష్యం : ఎమ్మెల్యే చిట్టిబాబు



**అయినవిల్లి, జులై 20, (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి మేలు చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని తొత్తరమూడి, వీరవల్లిపాలెం గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు వార జయసావిత్రి, సలాది బుచ్చిరాజు అధ్యక్షతన గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తొత్తరమూడి గ్రామంలో జరిగిన సురక్ష సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులందరికీ కుల, మత, ప్రాంత, పార్టీ రహితంగా ముఖ్యమంత్రి జగన్ మేలు చేస్తున్నారని అన్నారు. మధ్యవర్తులు, జన్మభూమి కమిటీలు లాంటి అవినీతికి అవకాశం లేకుండా నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంకా ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి అందని వారికి జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ది పొందుతారని చెప్పారు. అదేవిధంగా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జగనన్నకు చెబుదాం ప్రోగ్రాం ద్వారా మీ సమస్యలను వివరంగా తెలియజేయాలని కోరారు. వాలంటీర్ల పనితీరుపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు మంజూరైన వివిధ సర్టిఫికెట్లను ఎమ్మెల్యే చేతుల మీద అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, వార లక్ష్మీనరసింహారావ్, మట్టపర్తి రామారావు, కుసుమలిల్లి మంగేష్వర్ సునీల్ కుమార్, బొర్రపాలెపు సత్తిబాబు, ఎంపీడీవో తాడి శ్రీఆచార్యులు, తాహసిల్దార్ నాగలక్ష్మమ్మ, డిప్యూటీ తహశీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే జగన్ పాలన ఆదర్శం : డాక్టర్ గూడూరి

**రాజమహేంద్రవరం సిటీ, జులై 20, (ప్రభాతవార్త):** దేశంలోనే ఏపీ వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆకర్షణయంగా ఉన్నాయని రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. అందుకే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం నగరంలోని 42, 44, 45, 46 వార్డులలో జగనన్న సురక్ష కార్యక్రమాలు ఐ అవార్డు ఇన్చార్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలకు వైసిపి రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వడమే కాకుండా ఆయా వార్డులలో ఎవరికి ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఏమైనా సమస్యలు ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించాలని సీఎం జగన్ ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వార్డు వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, పార్టీ శ్రేణులు ప్రతి వార్డులోను పర్యటిస్తూ ప్రజల సమస్యలు, వార్డు సమస్యలు తెలుసుకునే వాటిని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను గూడూరి, అడపా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి సాంబశివరావు, ఆర్ఎంసి మేనేజర్ శ్రీనివాస్, ఎస్సై అమీనా బేగం, వైసిపి నాయకులు గూడూరి పాల్గొన్నారు.

## పీఆర్టీయు నూతన కార్యవర్గం ఎన్నిక



**మామిడికుదురు, జులై 20, (ప్రభాతవార్త):** మామిడికుదురు మండల పీఆర్టీయు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకొన్నారు. మండల పీఆర్టీయు అధ్యక్షుడిగా యాళ్ళ పళ్ళంరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా కె.వి. డి.ప్రసాద్, గౌరవ అధ్యక్షునిగా చప్పిడి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారునిగా ఎల్.శ్రీమన్నారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం, సభ్యులు మామిడికుదురు మండల విద్యాశాఖాధికారులు 1,2 లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయు మామిడికుదురు మండల యూనిట్ తరపున రెండు రివాల్వింగ్ కుర్చీలను ఎంఆర్సీ నకు బహూకరించి, పలు ఉపాధ్యాయ సమస్యల పై వినతిపత్రం అందించారు.

## ఆదిత్యలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం



**గండేపల్లి, జులై 20, (ప్రభాతవార్త):** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రవిశంకర్ తెలిపారు. విద్యార్థులకు చదరంగ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రవిశంకర్ మాట్లాడుతూ 1924లో అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఫిడే) స్థాపించబడిన రోజున ప్రతి సంవత్సరం జూలై 20న అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని జరుపుకుంటారని, చెస్ ఆడటం ద్వారా మెరుగైన ఆలోచనలు కలుగుతాయని మెదడు చురుకుగా పనిచేస్తుందని వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో.ఆర్డినేటర్.కె .సాయి ప్రియాంక, ఏ. ఎస్.గాయిత్రి, పి.డి.కిరణ్, డా.కె.రామకృష్ణ, కె.కీర్తిసాయి, పి.వినీల, ఎన్.దివ్య, బి.ఎస్.బి. వైదేహి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



**గండేపల్లి, జులై 20, (ప్రభాతవార్త):** గండేపల్లి మండలం మల్లేపల్లి, మురారిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ సిహెచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు మహారాజ్ షాయాజీ రావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ఖాతాదారులతో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మల్లేపల్లిలో 2016లో ప్రారంభమైన బ్యాంకు ఐదు వేల మంది ఖాతాదారులతో 58 కోట్ల టర్నోవర్తో దిగ్విజయంగా నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎమ్ ఆర్ శైలజ, ప్రసన్నకుమార్, గణేష్, సత్తిబాబు, పాపన్న దొర, ప్రభాకర్, మణికంఠ, గ్రంథి నాగసుబ్రహ్మణ్యం, కొత్త శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



**గండేపల్లి, జులై 20, (ప్రభాతవార్త):** జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ లబ్ది చేకూరుతుందని మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు ఉపసర్పంచ్ దొమ్మా శ్రీనులు అన్నారు. గురువారం మల్లేపల్లి సచివాలయం-2 జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రత్యేక అధికారి ఫిషరీస్ ఏడిఏ కె.కరుణాకర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగన్న సురక్ష పథకం యొక్క ప్రయోజనం చేకూరే లబ్ది తదితర అంశాలను వివరించి దరఖాస్తు చేసుకున్న 435 మందికి అర్హత సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామన్, ఇఓపిఆర్.డి మూర్తి, కార్యదర్శి కట్టా చంద్రశేఖర్. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి

## విధులకు గైర్హాజరై వీఆర్ఏలు నిరసన



**అంబాజీపేట, జులై 20, (ప్రభాతవార్త):** అపరిష్కృతంగా ఉన్న వీఆర్ఎల సమస్యలను సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలని అంబాజీపేట మండల వీఆర్ఎల సంఘ అధ్యక్షుడు బొంతు సత్యనారాయణ కోరారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్ఎలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపు మేరకు గురు, శుక్రవారం విధులకు హాజరు కాకుండా నిరసన తెలుపుతామన్నారు. అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, కనీస వేతనం రూ.21 వేయి, పాత డీఏని కొనసాగించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల కార్యదర్శి జంగా త్రిమూర్తులు, ఉపాధ్యక్షులు దివ్వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి పలువురు వీఆర్వోలు మద్దతు తెలిపారు.

# మన్నా కంపెనీ ఆధ్వర్యంలో స్టేజ్ ఏర్పాట్లు...

## బీహార్, బెంగుళూర్ నుండి సిబ్బంది




**అమలాపురం రూరల్, జూలై 20, (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 26వ తేదీన అమలాపురం రానున్న సందర్భంగా మన్నా కంపెనీ ఆధ్వర్యంలో సీఎం జగన్ ప్రసంగించే స్టేజ్ ఏర్పాట్లను చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన మన్నా కంపెనీ నేతృత్వంలో మొత్తం సీఎం మాట్లాడే స్టేజ్ నుండి డెకరేషన్, సౌండ్ సిస్టమ్, భారీ టెంట్స్, సీఎం కూర్చునేందుకు అనువుగా ఉండే చైర్స్ వంటి ఏర్పాట్లను చేస్తున్నారు. బీహార్ బెంగళూర్ రాష్ట్రాలతో పాటు విజయవాడకు చెందిన సిబ్బందంతా సీఎం జగన్ స్టేజ్ ఏర్పాట్లను చూస్తున్నారు. భారీ వర్షాలు, గాలులు వీచినప్పటికీ వాటిని తట్టుకునే విధంగా వాటర్ ప్రూఫ్ టెంట్స్ సౌకర్యాలను తీర్చిదిద్దుతున్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎక్కడ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న ఈ మన్నా కంపెనీ ఆధ్వర్యంలోనే స్టేజ్ ఏర్పాట్లు జరుగుతాయని సిబ్బంది చెప్పుకొస్తున్నారు.

# బడుగు, బలహీనులకు అన్యాయం చేసింది జగనే



**గోపాలపురం, జులై 20, (ప్రభాతవార్త):** బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేసింది సీఎం జగన్నే అని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ అధికారంలోకి వచ్చాక జీఓ నంబర్ 77 తీసుకొచ్చి పేదపిల్లలకు స్కాలర్ షిపులు వంటివి రాకుండా అన్యాయం చేసింది దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని సువర్ణరాజు ఏద్దేవా చేశారు. ఓటర్ల జాబితాలో కూడా తమకు అనుకూలమైన ఓటర్లను నమోదు చేయించుకున్నారన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో కూడా పనికిరాని స్థలాలను పేదలకు ఇచ్చి ప్రజలను మోసం చేసాడని, కేవలం పదవి కాంక్షతోనే జగన్ ఎన్నో జిమ్మిక్కులు చేస్తున్నాడని దుయ్యబట్టారు. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి ఇప్పుడు దానికి విరుద్ధంగా అధిక రెట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. బ్రెవరేజ్ వద్ద కోట్లాది రూపాయిలు అప్పు చెయ్యడం వలన మధ్యాన్ని నిషేధించలేక పోతున్నారని అన్నారు. నవరత్నాల అమలు చేస్తున్నాం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డి, నవరత్నాలు ఎవరికి అందుతున్నాయో చెప్పాలన్నారు. కేవలం ఓటు బ్యాంకు కోసం మీట నొక్కుతూ ప్రజలను మభ్య పెడుతున్నాడని, 12 వేల కోట్ల అప్పులు చేసి ఈ రాష్ట్రాన్ని అప్పులాంధ్రాగా మార్చారని సువర్ణరాజు విమర్శించారు. ఈ సమావేశంలో దేవరపల్లి, నల్లజర్ల జనసేన అధ్యక్షులు కాట్నం గణేష్, చోడసాని బాపిరాజు, పోసిన గణపతి, రుద్రశ్రీను, గెద్దాడ సత్యనారాయణ, నాగేంద్ర, సతీష్, ప్రగడ రాంబాబు తదితరులు ఉన్నారు.

# నవరత్నాల పథకాలు ద్వారా ప్రజల అభివృద్ధి : ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



**అల్లవరం, జులై 20, (ప్రభాతవార్త):** జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామ సచివాలయం 1 & 2 కి సంబంధించి గ్రామసచివాలయం -1 నందు సర్పంచ్ రాకాపు విజయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించటం జరిగినది. సదరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొమ్మి ఇజ్రాయెలు హాజరు కావటం జరిగింది. మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం కొరకు నవరత్నాలు పథకం ద్వారా ప్రజల అభివృద్ధి చెందుతున్నారని అన్నారు . 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. గతంలో ఈ సర్టిఫికెట్లకి అధికారుల చుట్టూ ప్రజలు తిరిగేవారని ఇప్పుడు గ్రామ సచివాలయం ద్వారా అందించడం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమం నందు మండలం అభివృద్ధి అధికారికృష్ణ మోహన్ అల్లవరం, మండలం తాసిల్దార్.ఎన్. ఎస్.ఎస్. ప్రసాద్ అల్లవరం మండల పరిషత్ అధ్యక్షుడు ఇళ్ళా శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు కొనుకు గౌతమి గ్రామ వార్డు సభ్యులు, గ్రామ కమిటీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు పెచ్చెట్టి వేంకటేశ్వరరావు మామిడిశెట్టి శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు హాజరు కావడమైంది. సర్పంచ్ మరియు పంచాయితీ కార్యదర్శి, నిమ్మకాయల వీర వెంకట సత్యనారాయణ. మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# 8 నెలలు గుర్రానికి అత్యవసర శస్త్ర చికిత్స... కంటిలోని పురుగు తొలగింపు



**అమలాపురం, జులై 20, (ప్రభాతవార్త):** 8 నెలల వయస్సున్న గుర్రానికి అత్యవసర శస్త్ర చికిత్స చేసి కంటిలోని పురుగును తొలగించారు. ఈ అరుదైన సంఘటన ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పశు వైద్యశాల వద్ద చోటు చేసుకుంది. ఈ గుర్రానికి అత్యవసరంగా కంటి శాస్త్ర చికిత్స చేసి కంటి లోపల ఉన్న ఐ వార్మ్ లార్వాను డాక్టర్ కర్నెడి మూర్తి, డాక్టర్ ఎల్ విజయ రెడ్డి, డాక్టర్ రమేష్ డాక్టర్ల బృందం కంటికి శాస్త్ర చికిత్స చేసి తొలగించారు. భీమనపల్లికి చెందిన రైతు ఎస్ వెంకటరమణకు చెందిన గుర్రం గత వారం రోజుల నుండి కంటి నుండి నీరు కారుతూ కన్ను అంతా తెల్లగా అయిపోయింది. ఒకవైపు కంటి చూపు కనపడక ఎంతో ఇబ్బంది పడుతూ మేత కూడా సరిగ్గా తినలేక ఇబ్బంది పడుతుంది. వెంటనే వీరు 1962 సిబ్బందికి తెలియజేసారు. అమలాపురం సహాయం సంచాలకులు విజియా రెడ్డి పరిశీలించి కంటి లోపల ఐ వార్మ్ నిర్ధారించారు. ఆ గుర్రాన్ని1962 వాహనంలో భీమనపల్లి పశు వైద్యశాలకు తరలించి శాస్త్ర చికిత్స చేసి తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కర్నెడి మూర్తి మాట్లాడుతూ సాధారణంగా ఈ పరాన్నజీవి లార్వాల ద్వారా వ్యాపిస్తుందని, లార్వాలు కంటి లోపలికి చొచ్చుకుపోయి ఒకటి నుంచి నాలుగు వారాల్లో నాలుగు సెంటీమీటర్ల నుండి ఏడు సెంటీమీటర్ల వరకు పొడవు పెరుగుతాయని తెలిపారు. దీని వలన కంటి లోపల ఉండి ఇరిటేషన్ కలిగిస్తుందన్నారు. కన్నుపైపొర తెల్లగా అయిపోయి కంటి చూపు మందగిస్తుంది. కంటి నుండి నీరు కారుతూ ఉండి సరైన సమయంలో శస్త్ర చికిత్స చేయించకపోతే గుడ్డిది అయిపోతుందని తెలిపారు. సరైన సమయంలో దానిని తొలగించడం వలన గుర్రానికి ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. రైతు ఎస్ వెంకటరమణ 1962 సిబ్బంది డాక్టర్ హెబ్సిబా వైద్యంలో సహకరించిన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావసరాల పరిష్కారానికే గడపగడపకు -మన ప్రభుత్వం : ఎమ్మెల్యే కొండేటి

**అంబాజీపేట, జులై 20, (ప్రభాతవార్త):** నాలుగేళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలను అందుకోలేని అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకే గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గడప గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్దిని గురించి వివరించారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి,కాపు నేస్తం, రైతు భరోసా వంటి బృహత్తర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్మోహన్రెడ్డిదే అన్నారు. అలాగే అన్ని అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందుకున్న లబ్దిదారులకు బ్రోచర్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ



కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, ఎఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చిన్నబాబు, మైలా ఆనందరావు, నేదునూరి ఏసుబాబు,కోట సత్తిబాబు, కుసుమ వరలక్ష్మి, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి హరి, పితాని శెట్టి, గంటి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్రియకు సహకరించాలి : తాహసిల్దార్ నాగలక్ష్మమ్మ



**అయినవిల్లి, జూలై 20 ( ప్రభాత వార్త ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు మండల యంత్రాంగానికి సహకరించాలని అయినవిల్లి మండలం తహసిల్దార్ నాగలక్ష్మమ్మ కోరారు. స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో తాహసిల్దార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ప్రత్యేక ఓటర్ జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించిన డేటా పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఇంటింటి సర్వేలో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు తమ తమ పార్టీలు తరపున బూత్ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం నిర్వహించినట్లయితే వాటర్ జాబితా మరింత కచ్చితత్వంతో జవాబుదారితనంతో ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ఆగస్టు 22 తర్వాత పోలింగ్ కేంద్రాల రేష్మలైజేషన్ రాజకీయ పార్టీల సూచనలు ఆమోదం మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 30 నాటికి పూర్తిచేసి అక్టోబర్ 17న ఓటర్ జాబితా డ్రాఫ్ట్ రోల్‌ను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. డోర్ నెంబర్ల తేడాలు, ఫొటోస్ కరెక్షన్లు, పుట్టిన తేదీలలో మార్పులు ఇంటింటి సర్వేలో సరి చేయడం జరుగుతుందన్నారు. 100 సంవత్సరాల దాటిన ఓటర్లను గుర్తించి ఓటింగ్ విధానంలో ప్రత్యేక సౌలభ్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ జాబితాలో కొత్త ఓటర్ల నమోదు ఫార్మ్ 6 ద్వారా, 6ఏ ద్వారా చిరునామా, నియోజకవర్గ మార్పులు ఫార్మ్ 8ఏ, మరణించిన వారి వివరాలు పాము ఫార్మ్ 7 ద్వారా తొలగించడం కోసం ఇంటింటి సర్వే కోసం బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల వారికి ఇంటింటా సర్వే ప్రక్రియ మంచి సదావకాశమని, ఓటరు జాబితా మరింత కచ్చితత్వంతో ఉండేందుకు దోహదపడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తాడి శ్రీఆచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ అశోక్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే పర్యటన

**పి.గన్నవరం, జులై 20, (ప్రభాతవార్త):** మండలంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన లంక గ్రామాలలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నదికి మరింత వరదలు ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి అధికార యంత్రాంగం ద్వారా లంక గ్రామాల ప్రజలకు అందుతున్న వరద సహాయక చర్యలు గురించి ఆయన వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర బ్రాహ్మణ



కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎస్సై హరికోటి శాస్త్రి, స్థానిక వైసీపీ నేతలు ఉన్నారు.

# ఎమ్మెల్యే గొల్లపల్లిని పరామర్శించిన పరిపాలన అధికారి మునిస్వామి



**యానం, జులై 20, (ప్రభాతవార్త):** యానం నియోజకవర్గం యానం ఇటీవలి తన ఎడమ కాలికి ఆపరేషన్ చేయించుకున్న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను గురువారం గోపాల్నగర్లో ఆయన స్వగృహంలో పరిపాలన అధికారి మునిస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే గొల్లపల్లికు ఎడమకాలి లోపలి భాగంలో నరం (లిగ్మెంట్కు)కు గాయమయ్యింది. అయితే అప్పటినుంచి ఆయన పట్టించుకోకుండా పుదుచ్చేరి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ప్రజాసమస్యలపై పర్యటనలు చేయడంతో ఇటీవలి అది పెద్దది కావడంతో హైద్రాబాద్లో వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. దీంతో ఆయన కొద్దిరోజులుగా కోలుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీరసెల్వం, నాయకుల పండు సిద్దార్థకుమార్, నక్కల సుబ్బన్న, సబ్బతి లోకేష్, మచ్చ శ్రీను, కవల బాబులు, కోన పండు తదితరులు పాల్గొన్నారు. వరద పరిస్థితిపై ఎమ్మెల్యే సమీక్ష... గౌతమీ గోదావరి వరద ఉదృతి తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఎమ్మెల్యే అశోక్ పరిపాలనాధికారి మునిస్వామితో సమీక్షించారు. తీర గ్రామాలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు, సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా చేపడుతున్న పనులపై సైతం చర్చించారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చి వేసిన అధికారులు...వార్త ప్రభావం




**జగ్గంపేట, జులై 20, (ప్రభాతవార్త):** స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న పుష్కర కాలువ గట్టుపై అక్రమంగా నిర్మాణం చేపట్టడం విధితమే. దీనిపై వార్తలో పుష్కర కాలువ గట్లపై అక్రమ నిర్మాణాలు అనే వార్త ప్రచురించడమైనది. దీంతో జిల్లా అధికారులు స్పందించి గురువారం పుష్కర జేఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి గణేష్ బాబు ఆధ్వర్యంలో అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా మంచినీటి చెరువుకు నీరు వెళ్లే ఊర కాలువ ను కొంతమంది అక్రమ దారులు ఆక్రమించుకున్నారు. కాలువను చదును చేసి అక్రమదారులు పక్కాగా బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై కూడా అధికారులు దృష్టి పెట్టి ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# సమగ్ర ఓటరు సర్వే సక్రమంగా నిర్వహించండి

## - తహశీల్దార్ ఎల్.శివకుమార్



**తుని, జులై 20, (ప్రభాతవార్త):** రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవెల్ అధికారులు సక్రమంగా నిర్వహించాలని తుని తహశీల్దార్ ఎల్.శివకుమార్ ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సమగ్ర ఓటరు సర్వేపై బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండేలా బూత్ లెవెల్ అధికారులు కృషి చేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారి బూత్ పరిధిలోని ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలోని డబల్ ఎంట్రీలు, మరణించిన వ్యక్తుల ఓట్లను తొలగించాలన్నారు. ఓటరు అభ్యర్ధన మేరకు వారి యొక్క ఓటును వారు నివసించే ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న బూత్‌లకు మార్పు చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డు, జాబితాలో తప్పులను సవరించాలన్నారు. జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు నెలరోజుల పాటు చేపట్టే సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే దిశగా బూత్ లెవెల్ అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తుని మండలంలోని గ్రామాలకు చెందిన బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష క్యాంపులకు విశేష ఆదరణ

## - వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం : శాసనసభ్యులు కన్నబాబు



**కాకినాడ రూరల్, జులై 20, (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జులై ఒకటి నుండి చేపట్టిన జగనన్న సురక్ష క్యాంపులకు ప్రజల నుండి విశేష ఆదరణ వస్తుందని మాజీ మంత్రి,కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. గురువారం రమణయ్యపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజల నాడిని పట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని, ఆయన స్థాపించిన సచివాలయ వ్యవస్థలోని వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రతిపక్షాలు వాలంటీర్ వ్యవస్థపై బురదజల్లే కార్యక్రమాన్ని మానుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఎనభై వేల మంది వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు అని వారిలో డబ్బై శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న 57,30,000 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటిఏడు లక్షల గృహాలు పూర్తి చేయబడ్డాయి అని అన్నారు. జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమానికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపిశెట్టి పద్మజా బాబ్జి, వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షురాలు వర్తినీడి సుజాత, రాయుడు వెంకటేశ్వరరావు, కోమలి సత్యనారాయణ, పాలిక రమణ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయం : ఎమ్మెల్యే జక్కంపూడి



**సీతానగరం, జులై 20, (ప్రభాతవార్త):** 2024 ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి వచ్చిన తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని స్థాపించబోతుందని రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. రఘుదేవపురంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనంలో కొట్టుకుపోతామనే భయంతో తామంతా కలిసి పోటీ చేయాలని భావిస్తున్నాయని అన్నారు. ప్రజల పక్షాన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారు కాబట్టే ప్రజలు ఆయనకి తిరిగి అధికారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని ఐదేళ్ల పాలనలో సంక్షేమం అభివృద్ధి అవినీతి రహిత పాలనను తమ ప్రభుత్వం అందించిందని భవిష్యత్తులో ఇదే తరహా పాలన కొనసాగేందుకు ప్రజలంతా జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నిరంతరం ప్రజల కోసమే పని చేసాం కాబట్టి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కనుమరుగైపోయిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పనితనం చూసిన ప్రజలు తిరిగి మళ్లీ తమను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని, గడపగడపకు ప్రభుత్వంలో వస్తున్న ప్రజాదరణ దానికి నిదర్శనమని అన్నారు. కొందరు వ్యక్తులు డబ్బులు ఉన్నాయని రాజకీయాలు మొదలుపెట్టి పబ్లిసిటీ ద్వారా నాయకులుగా ఎదగాలనుకుంటున్నారని రాజకీయాలలో ప్రజాసేవ ముఖ్యమని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎంపీటీసీలుగా గెలుపొందిన వ్యక్తులు పదవికి రాజీనామా చేయకుండా రాజకీయాలు చేసి నాయకులు అయిపోయామని అనుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వాలు అధికారంలో ఉండగా కేవలం నాయకుల అభివృద్ధి మాత్రమే చూసి ఉన్నారని తమ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం మాత్రమే పనిచేస్తుందని దానికి ఉదాహరణ 84% కార్డుదారులు, 93% లబ్ధిదారులుగా, 72 లక్షల మందికి పెన్షన్ దారులుగా తమ ప్రభుత్వంలో ఉన్నారని పార్టీలకు కులాలకు మతాలకు వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు ఎవరైనా లబ్ధిదారులు మిగిలిపోతే తెలుసుకొని అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందించడం కోసమే జగనన్న సురక్ష పథకం అని అన్నారు. 6 లక్షల 87 వేల 863 ధ్రువీకరణ పత్రాలు ఒక్క రోజులోనే అందించామని జగనన్న సురక్ష పథకం ద్వారా పత్రాలు జారీ చేయడంలో జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని అందుకోసం జిల్లా కలెక్టర్‌కి, అధికారులకు అభినందనలు తెలుపుతూన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు మండల కన్వీనర్ గంటా శ్రీను, కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, ఎంపీపీ గుర్రాల జ్యోస్న, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, జడ్పిటిసి చల్లమల వెంకట లక్ష్మి, సుజీ రాజు, సర్పంచ్ సంఘ అధ్యక్షులు కొండ్రు ముత్యాలు, గెద్దాడ త్రిమూర్తులు, ఎంపీటీసీ పంతుల వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ హిమాన్షు శుక్లా



**అమలాపురం కలెక్టరేట్, జులై 20, (ప్రభాతవార్త):** మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలలోని గోదావరి నది పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరిందని, కోనసీమ జిల్లా గోదావరి తీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థానిక కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తుల నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే గోదావరి వరదల ముంపు బాధితుల సహాయక చర్యలను చేపట్టాలన్నారు. గోదావరి హెడ్ వర్క్స్ ఇంజనీర్లు నది కన్జర్వేటర్లు, ఏటిగట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలని సూచించారు. గోదావరి హెడ్ వర్క్స్ జల వనరుల శాఖ ఇంజనీర్లు, ఆర్డీవోలు,తాసిల్దార్లు ఎంపీడీవోలు సంయుక్తంగా ఏటిగట్టు పరిరక్షణకై 500 మీటర్లకు ఒక వాలంటీర్ చొప్పున నియమించి పర్యవేక్షణను బలోపేతం చేయాలన్నారు. వాలంటీర్లు 500 మీటర్లు నడిచి ఏటిగట్టు పటిష్టతపై నివేదికను ఎంపీడీవోలు అందించాలని సూచించారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్నచోట్ల తాత్కాలిక పద్ధతిలో ఇసుక బస్తాలు మట్టి తరలించి పటిష్టం చేయటం జరుగుతుందన్నారు. అప్పనపల్లి పెదపట్నం లంక బీ.దొడ్డవరం పాశ ర్లపూడి పాశర్లపూడి లంక గ్రామాలలో ఏటిగట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలన్నారు. పి.గన్నవరం మండలంలో నాగులంక, ఎల్. గన్నవరం మానేపల్లి, మొండిపులంక ఏటిగట్టు ఎత్తును పెంచాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు. అదేవిధంగా జి పెదపూడి 4 లంక గ్రామాలకు బోట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అయినవిల్లి మండలంలో చింతలంక తోత్తరమూడి తదితర గ్రామాలలో వరద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అంబాజీపేట మండలంలో డ్రైన్లు పొంగే అవకాశం ఉందని ముందస్తుగా వరద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రాజోలు మండలం నున్నవారి బాడవ, మేకావారిపాలెం, ఏటిగట్టు ఎత్తున పెంచాలన్నారు. సోంపల్లి పొదలాడ లంక తాటిపాక, శివకోడు లంక, సఖినేటిపల్లి మండలం అప్పన రాముని లంక, వరద సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ముమ్మిడివరం మండలం లంక గ్రామాలలో సహాయ పునరావాస కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాట్రేనికోన మండలంలో కూడా పల్లంకుర్రు రేవు వద్ద ఇసుక బస్తాలతో వరద నీటి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం డివిజన్లో ఐదు లంక గ్రామాలలో పంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏటిగట్ల పటిష్టతపై నివేదికల వెంటనే సమర్పించాలన్నారు. పునరావాస కేంద్రాలలో వంట షెడ్లు, టాయిలెట్లు సక్రమంగా ఉన్నది లేనిది పరిశీలించాలన్నారు. 80 సంవత్స రాలు వయసు పైబడిన వృద్ధులందరినీ ముందుగా తరలించాలన్నారు. పాముకాట్లు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున ఆయా మందులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. నాలుగు వందల కుటుంబాలు గల ప్రాంతంలో ఒక ఇంటిని ఎంపిక చేసి కుకింగ్ కేంద్రం ఏర్పాటుచేసి నాణ్యతతో భోజనం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఉల్లిపాయలు టమాటాలు బంగాళాదుంపలు ఎస్టేట్ ఆఫీసర్ల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అన్ని బోట్లలో లైఫ్ జాకెట్లు ఉంచి అవి అందరూ ధరించేలా జాగ్రత్తలు వహించాలన్నారు. ఏపీ ట్రాన్స్ కో అధికారులు విద్యుత్ వైర్లు కిందకి లేకుండా ఎత్తుగా బిగించాలని, విపత్తును ఎదుర్కొనేందుకు అవసరమైన స్తంభాలు కండక్టర్లు, ట్రాన్స్ఫార్మర్లు ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామీణ త్రాగునీటి సరఫరా అధికారులు గ్రామాలలో సి పిడబ్ల్యూఎస్. స్కీంల వద్ద జనరేటర్ ఏర్పాటు చేసి ముంపు బాధితుల కొరకు 20 లీటర్ల వాటర్ క్యాన్లు వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేయాలన్నారు. సెల్ టవర్స్ నిరంతరాయంగా జనరేటర్‌పై పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, ట్రాన్స్కో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యానంలో గోదావరి వరదతో పొంచి ఉన్న ప్రమాదం



**యానం, జులై 20, (ప్రభాతవార్త):** యానం నియోజకవర్గం యానం కనకాల పేటలో గోదావరి వరదలు రావడంతో లంక భూములకు ప్రమాదం పొంచి ఉంది. కనకాల పేట రైతులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న అధికారుల్లో స్పందన లేదు. జూలై నెలలో వరదలు వచ్చిన కారణంగా గోదావరి రక్షణ గోడ (రివిట్మెంట్) 20 మీటర్ల మేర గోదావరి కోత గురైంది. అధికారుల నిర్లక్ష్యంతో 40 మీటర్లకు చేరింది. గోదావరి వరద ప్రవాహం పెరగడంతో అలల తాకిడికి రివిట్మెంట్ కూలిపోయి లంకలు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి త్వరగా స్పందించకపోతే పెను ప్రమాదం పొంచి ఉంది. 16 నెలలు క్రితమే రక్షణ గోడకు (రివిట్మెంట్) మరమ్మతులు చేశారు. అధికారులు నాణ్యమైన పనులు చేయించకపోవడం వలన జూలై నెలలో వచ్చిన వరదలకు రక్షణగోడ (రివిట్మెంట్) కూలిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా పనులు మొదలు పెట్టి వరద రక్షణ గోడా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల సమావేశం



**మామిడికుదురు, జులై 20, (ప్రభాతవార్త):** డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండల ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం మామిడికుదురు అంబేద్కర్ సామాజిక భవనమునందు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఆగస్ట్ రెండవ వారంలో హైదరాబాద్‌లో ఎస్సీల వర్గీకరణ కోరుతూ జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభ ను విజయవంతం చెయ్యాలని, ప్రతి ఇంటి నుండి హైదరాబాద్‌కు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నేదునూరి రాజేష్, సిర్రా శ్రీను, ముసూడి నరసింహాస్వామి, మంద గాంధీ, చేట్ల సత్యనారాయణ, బొంతు సుధాకర్, ఆకుమర్తి వెంకటరమణ, బొంతు సాయి తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల తలపిస్తున్న డ్రైవర్స్ కాలనీ సిసి రోడ్డు



**గోకవరం, జులై 20, (ప్రభాతవార్త):** స్థానిక డ్రైవర్స్ కాలనీలో ఎన్నో సంవత్సరాల నుండి డ్రైనేజీలు లేక ఇక్కడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి దోసపాటి సుబ్బారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఈ సమస్యను అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు తెలియజేయడం జరిగిందని, ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదంటూ ఇక్కడి ప్రజలు తెలియజేసినట్లు సుబ్బారావు అన్నారు. గతంలో ఎక్కడ ఎంత నీరు నిలిచేది కాదని డ్రైవర్స్ కాలనీకి సమీపంలో ఉన్న ఊరకాలను కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టడంతో ఆ ఊర కాలువ నుండి నీరు మొత్తం రోడ్లపై నిల్వ ఉంటుందని అన్నారు. ఈ నీరు రోడ్డుపై నిల్వ ఉండడం వల్ల దోమలు ఎక్కువ కావడంతో ఇక్కడి ప్రజలు అధికంగా రోగాలకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి తక్షణమే డ్రైవర్స్ కాలనీకి డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులతో పాటు జన సైనికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల మీడియా విభాగం అధ్యక్షులు మహిపాల పాండురాజు, నక్క రామరాజు, దోసపాటి సుబ్బారావు, సియాధుల శ్రీను, సింగవరపు కృష్ణ, సుంకర నరేంద్ర, పడాల చిన్న, పిన్నమరెడ్డి ఆంజనేయులు, మైపాల కాపు, ఆచంట నూకరాజు, హనుమంచిపల్లి తమ్మాచారి, కవల ప్రసాద్‌లతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

# వరద వచ్చే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

## వరద వచ్చే ప్రాంతాల్లో ఏర్పాట్లుపై సమీక్ష



**అల్లవరం, జులై 20, (ప్రభాతవార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్లవరం మండలంలో వరదకు గురయ్యే ప్రాంతాల సెక్రెటరీలు, వీఆర్వోలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ ప్రసాద్ మాట్లాడు తూ ఎగువ నుండి వస్తున్న ప్రవాహం మేరకు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పారిశుధ్య, త్రాగునీటి ఏర్పాట్లుపై కార్యదర్శులు శ్రద్ధ వహించి, సున్నం బ్లీచింగ్ స్టాక్ పెట్టుకోవాలని, ఏటి గట్టు వాలంటీర్స్ ద్వారా తనిఖీ చేయించి లోపాలు ఉంటే రిపోర్ట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపిడిఓ కార్యదర్శులు వీఆర్వోలు పాల్గొన్నారు.

# రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



**అమలాపురం రూరల్, జూలై 20, (ప్రభాతవార్త):** అమలాపురం రూరల్ మండలం కామనగురువు గ్రామ పరిధి 1 వార్డు జంగం పాలెంలో రూ 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ భూమి పూజ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుపూడి భాస్కరరావు, పంచాయితీ కార్యదర్శి ఏఎస్ వి ఎస్ఎస్ రాజేశ్వరరావు, జెఎబిసి పి ఆదినారాయణ, మాజీ ఉప సర్పంచ్ చొల్లంగి శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వం అంటే బాధ్యత వహించడంగా భావించాలి

## - శ్రీ ప్రకాష్ సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్



**తుని, జులై 20, (ప్రభాతవార్త):** నాయకత్వం అనే బాధ్యత సక్రమంగా నిర్వహించడమే నాయకుల ముఖ్య లక్షణం నాయకత్వం అంటే బాధ్యత వహించడం అని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ పేర్కొన్నారు. శ్రీ ప్రకాష్‌లో ఏర్పాటు చేసిన స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ మరియు హౌస్ కెప్టెన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అయన మాట్లాడుతూ విద్యార్థి దశలో బాధ్యతాయుతంగా ప్రవర్తించిన వారు భవిష్యత్‌లో ఎవరికీ జవాబుదారీగా ఉండనవసరం లేదని వారి భవిష్యత్‌కి వారే మార్గదర్శకులుగా నిలుస్తారని, హృదయపూర్వకంగా, నిజాయితీగా కష్టపడితే వారు అనుకున్న స్థాయికి చేరగలరని తెలిపారు. రేపటి తరానికి కావలసిన నాయకత్వ లక్షణాలు ఈ విద్యార్థి నాయకులుగా వారు నేర్చుకుని అద్భుత ప్రతిభ కనబరచగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులచే నిర్వహించిన మార్చిఫాస్ట్ నందు గౌరవ వందనం స్వీకరించి నాయకత్వ బాధ్యతలు సక్రమంగా నిర్వహించేలా ప్రతిజ్ఞ చేయించారు. విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్ వి వి ఎస్ మూర్తి మాట్లాడుతూ నాయకులకు శరీర దృఢత్వం చాలా అవసరమని, శారీరకంగా దృఢత్వం ఉంటేనే మానసికంగా దృడంగా ఉంటామని, వ్యాయామం మరియు క్రీడలు మన దైనందిన జీవనంలో భాగం కావాలని అయన తెలిపారు. ఈ కెప్టెన్ మరియు వైస్ కెప్టెన్ ఎంపిక ప్రక్రియ క్రీడలు, గ్రూప్ డిస్కషన్, వ్రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ తదితర అంశాల ద్వారా ఎంపిక చేశామని అయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.సీతారాణి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajahmahendravaram - 533 103, Phone : 2469407, 2469408, RNI No. 64863/96, Editor: Damerla Sai Baba, Responsible for election of News-under the PRB Act. Regd.No. H/SD/337/90-11 Air Surcharge : Delhi : 40Ps

# వానాకాలంలో.. నేల శుభ్రంగా..

వర్షాకాలంలో బయటి నుంచి ఇంటికొచ్చే వాళ్ల ద్వారా బురద, క్రిములు.. వంటివన్నీ ఇంట్లోకి చేరతాయి. అందుకోనూ నేలపై అంటుకున్న మురికి, మరకలు ఓ పట్టాన వదలవు. అలాగని వాటిని వదిలేసి చేజేతులా



అనారోగ్యాలు కొనితెచ్చుకోలేం. కాబట్టి వానాకాలంలో ఇంట్లోని ఫ్లోర్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిందే! తద్వారా ఇంటిని క్రిమి రహితంగా ఉంచుకోవచ్చు. అందుకోసం ఏం చేయాలో చూద్దాం రండి..

**తేమ పీల్చుకోకుండా...** వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. పైగా తరచూ వర్షాలు కురుస్తూ ఉంటాయి. దీంతో ఫ్లోర్ కాస్త చెమ్మగా మారుతుంది. సోప్‌స్టోన్, గ్రానైట్ తరహాఫ్లోర్ అయితే ఈ విషయంలో కాస్త జాగ్రత్త పాటించాలి ్సందే. ఎందుకంటే వీటికి తేమను పీల్చుకొనే గుణం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఏదైనా మరక అయితే అది వెంటనే గట్టిపడిపోతుంది. ఇక దాన్ని వదిలించడం కష్టమవుతుంది. అందుకే వాటిపై మార్బుల్ సీలర్ వేయడం మంచిది. ద్రవరూపంలో ఉండే దీన్ని మెత్తటి పెయింట్ బ్రష్ లేదా శుభ్రమైన వస్త్రం సాయంతో అప్లై చేస్తే సరిపోతుంది. లేదా ఫ్లోర్ పాలిషింగ్ చేయించడం ద్వారాకూడా తేమను పీల్చుకొనే గుణాన్ని తగ్గించవచ్చు.



**వేడినీటితో..** వర్షాకాలంలో రోడ్ల పైకి చేరే మురుగు నీటి కారణంగా హానికారక క్రిములు ఇంట్లోకి ప్రవేశించే అవకాశం ఉంది. అందుకే వాటిని అరికట్టే విధంగా గచ్చుని శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అప్పుడప్పుడూ ఫ్లోర్‌ని వేడి నీటితో శుభ్రం చేయాలి. ఆ తర్వాత నూలు వస్త్ర లేదా స్పాంజ్‌తో తుడిస్తే సరిపోతుంది. దీనికోసం ఫ్లోర్ క్లీనర్లను సైతం ఉపయోగించవచ్చు. సాధారణమైన లేదా టైల్స్ ఉన్న ఫ్లోర్ విషయంలో ఈ రెండు చిట్కాలను పాటించవచ్చు. అదే మార్బుల్ ఫ్లోర్ అయినట్లైతే.. వాటిని శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా తయారుచేసిన మార్బుల్ ఫ్లోర్ క్లీనర్లు ఉపయో గించడం మంచిది. వీటివల్ల అవి పాడవకుండా ఉంటాయి. అలాగే వెనిగర్, నిమ్మ అమ్మోనియా వంటి వాటిని మార్బుల్ ఫ్లోర్ శుభ్రం చేయడానికి ఉపయోగించక పోవడమే మంచిది.



**కిచెన్‌లో ఇలా...** ఇంట్లో మిగిలిన గదులన్నింటిలోనూ నేలను శుభ్రం చేయడం ఒకెత్తయితే..కిచెన్‌లో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం మరో ఎత్తు వంట చేసేట ప్పుడు చిందే నూనె కారణంగా అక్కడ జిడ్డుగా తయారవు తుంది. కాబట్టి దీన్ని శుభ్రం చేసేట ప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. దీనికోసం పావు బకెట్ వేడినీళ్లలో అరకప్పు వెనిగర్ వేసి మిశ్రమంగా తయారుచేయాలి. దీనిలో మాప్‌ను ముంచి నేలను శుభ్రం చేయాలి. అప్పై పొడి వస్త్రంతో తుడిచేస్తే సరిపోతుంది. వంట చేసేటప్పుడు పొరపాటున నూనె కిందపడిపోతే దానిపై పేపర్ టవల్‌ని వేయాలి. ఇది నూనెను పీల్చేస్తుంది. ఆ తర్వాత మెత్తటి వస్త్రాన్ని ఫ్లోర్ క్లీనర్‌లో ముంచి తుడిస్తే జిడ్డు త్వరగా వదిలి పోతుంది. ❑

# ప్రాచీన కళలకు ప్రాణం పోస్తూ..



**కళలు సంస్కృతికి ప్రతిబింబాలు. అలాంటి అద్భుత కళా రూపాల్లో చేనేత కూడా ఒకటి. మగువల మనసు దోచుకునే ఈ పనితనం వెనుక ఎంతో చరిత్ర దాగుంది. మరెన్నో కథలనూ తనలో ఇముడ్చుకుంది. దాన్నే వెలికి తీయాలనుకున్నారు ఫ్యాబ్రిక్ స్పెషలిస్ట్ హేమలత, 'పునరుజ్జీవన ట్రస్ట్'ని స్థాపించి అరుదైన నేత పనితనాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.**

'భారతదేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం. ఇక్కడ ప్రతి కళకూ చరిత్ర ఉంటుంది. ఇందులో చీర ఓ సంప్రదాయం' అంటారు హేమలత బెంగళూరులో పుట్టి పెరిగిన ఆమెకు సంప్రదాయాలన్నా, కళారూపాలన్నా ఎనలేని మక్కువ. అదే ఆమెను కర్ణాటకలోని పురాతన నేత కళ పునరుద్ధరణపై దృష్టి సారించేలా చేసింది. యూఎస్‌లోని కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీలో పనిచేసి 2014లో భారత్‌కి తిరిగి వచ్చారావిడ. చేనేత కళలపై ఆసక్తితో 'ఫ్యాబ్రిక్స్ అండ్ క్రాఫ్ట్స్'లో డాక్టరేట్ చేశారు. ఆ సమయంలో చేనేత గ్రామాల్లోని నేత కార్మికులతో మాట్లాడినప్పుడు.. ఎంతో మంది నేతన్నలు వృత్తిని వదిలేసిన తీరూ, ఎన్నెన్నో కళారూపాలూ, నైపుణ్యాలూ మరుగున పడిపోతున్న వైనం ఆమెను కదిలించాయి. ఆ తర్వాతే..కళాకారులు, స్థానిక చేతి వృత్తి నిపుణులకు చేయూతనిస్తూ అవసాన దశకు చేరుకున్న నేత నైపుణ్యాలకు ఆదరణ కల్పించాలను కున్నారు. దాని కోసమే 'పునరుజ్జీవన ట్రస్ట్'ని ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని చేనేత కార్మికులు, కళాకారులతో కలిసి పనిచేస్తున్నారు.

**శిక్షణా ఇస్తున్నారు.....** జీఐ ట్యాగ్ ఉన్న మైసూరు సిల్క్, సంప్రదాయ ఇల్కల్ వంటి చేనేత వస్త్ర రకాలకు దక్షిణాది రాష్ట్రాల్లో గొప్ప పేరు. అయితే, అవి అందరికీ అందుబాటులో లేవలని తెలుసుకున్నారు హేమ. పురాతన చీరల శైలులూ, పనితనం వంటి వాటి గురించి విచారిస్తుంటే 250 ఏళ్ల నాటి 'పట్టెడ అంచు' చీర ప్రాధాన్యత తెలిసింది. ఇది గజేంద్రగడ్, బెల్గాం, రాయచూర్, కోడల్, బీదర్, బళ్లారి, గుల్బర్గా, ధార్వాడ్ ప్రాంతాలలో బాగా ప్రసిద్ధి చెందింది. చీర అంచుతోనే విశిష్ట లక్షణాన్ని ప్రోది చేసుకున్న ఈ పనితనానికి మళ్లీ పేరు తేవాలనుకున్నారు. అలానే 'సుధా కడి, గోమితేని, హుబ్లీ చీర' వంటివెన్నో శైలులు వెలుగులోకి వచ్చాయి. పవర్ లూమ్‌పై చేయి సాధించడంతో.. వీటిని నేసే నేతన్నల సంఖ్య తగ్గి పోయింది. వారిని అతికష్టం మీద వెతికి పట్టుకున్నారు హేమ. మరో 20 రకాల పురాతన చేనేత పద్ధతుల్లోనూ నేసే పనిలో పడ్డారు. ఇందుకోసం నిపుణు లైన పని వారూ, నూలు వడికేవారు. రంగులద్దే వారు, ఎంబ్రాయి డరీలు చేసేవారు. క్విల్టర్స్, బ్లాక్ ప్రింటర్స్.. వంటి కళాకారులందరినీ ఈ వేదికపైకి తెచ్చి ఆ ఉత్పత్తు లను మార్కెట్ చేస్తున్నారు. తర్వాత తరం వారికి ఈ కళల్ని పరిచయమూ చేస్తున్నారు. ఉత్తర కర్ణాటకలో నాబార్డు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఔత్సాహికులకు వీవింగ్ టెక్నిక్స్‌నూ నేర్పిస్తున్నారు.

**ఇబ్బందులెన్నో....** ప్రాభవం కల్పోతోన్న చేనేత చీరలకు వైభవం తీసుకు రావడం అంత సులువైన పనేమీ కాదు. ఎందరో చేనేత కార్మికులు పని దొరక్క వృత్తిని వదిలేశారు. తిరిగి వారిని ఆ వృత్తిలో కొనసాగేలా చేయడానికి చాలా కాలమే పట్టిందామెకు తరచూ చేనేత చీరలతో వివిధ ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రారంభించారు. ఆధునిక తరాలకు ఆకట్టుకోవవడం కోసం శతాబ్దాల నాటి చీరలకు ఫ్యాషన్ టచ్ ఇస్తున్నారు. తాజాగా భారతీయ మహిళా శాస్త్రవేత్తల సంఘం సర్వర్ణోత్సవ వేడుకల్లో 37 మంది సీనియర్ శాస్త్రవేత్తలు వీటిని ధరించి వేదికపై సందడి చేయడంతో మరోసారి ఈ ట్రస్ట్ పేరు, హేమ కృషి వార్తల్లో నిలిచాయి. ఇద్దరితో ఆరంభమైన వీరి ప్రయాణంలో 55 మంది నేతన్నలూ, 20మంది రంగులద్దే కార్మికులూ తోడయ్యారు. వందల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఎగుమతులతో కోట్ల రూపాయల టర్నోవర్‌నీ అందుకుంటోంది. వీటన్నింటి కన్నా ముఖ్యంగా అంతరించి పోయా మనుకున్న నైపుణ్యాలనుకాపాడగ`లగడం ఎక్కువ తృప్తిని ఇస్తోందంటారు హేమ. ❑

# ఉల్లాసంగా తగ్గేయండి !



**బరువు తగ్గాలంటూ రకరకాల డైట్‌లను అనుసరించే అమ్మాయిలెందరో! చాలా కఠినంగా అమలు చేస్తుంటారు కదా.. నీరసంతో పడిపోయేవారూ లేకపోలేదు. దీంతో డైటింగ్ మానేస్తుంటారు. ఉల్లాసంగా అంటూనే కొవ్వు తగ్గే మార్గాలు కావాలంటే నిపుణుల సూచనలు తెలుకుందాం..**

- కెలోరీలకు కళ్లెం బరువు తగ్గే క్రమంలో అమ్మాయిలు అనుసరించే ప్రధాన సూత్రమిది. ఒండి నడవడానికి చమురెలాగో.. శరీరం పనిచేయడానికీ శక్తి కావాలిగా! కాబట్టి తగినన్ని కెలోరీలు, అవసరమైన పోషకాలు అందుతున్నాయా గమనించుకోండి.
- చెమట చిందించడంపైనే దృష్టి పెట్టొద్దు. తగినంత నీరూ శరీరానికి అందాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, జావ, కెలోరీలు తక్కువ. తక్షణ శక్తిని అందించగలవు. గుర్తుంచుకొని మరీ వీటిని తరచూ తీసుకోండి. శరీరంలో నీరు తగ్గినా శక్తి తరుగుతుంది.
- ప్రొటీన్ అందుతోందా? ఇది తగ్గినా నిస్సత్తువ ఆవరిస్తుంది. శరీరం తనను తాను రిపేర్ చేసుకోవడానికీ కావాల్సిన ప్రొటీన్ అందించా ల్సిందే.
- తిండి ఆపేస్తే బరువు తగ్గుతారంటే అపోహ! కావాల్సిన పరిమాణాల్లో ఆహారాన్ని అందిస్తూనే స్టెంత్ ట్రెయినింగ్ వగైరా చేయండి. కెలోరీలు తగ్గడమే కాదు. మనసుకీ ఉల్లాసం.
- బరువు తగ్గే క్రమంలో ఎవరినీ అనుసరించొద్దు. ప్రతి ఒక్కరి శరీరమూ ప్రత్యేకమే. మీ బరువు ఎత్తు ఆధారంగా రోజులో ఎంత ఆహారం, శారీరక శ్రమ అవసరమో తెలుసుకొని దాని ప్రకారం ప్లాన్ చేసుకోండి. ఇవన్నీ పాటిస్తే బరువు తగ్గే క్రమమూ ఉల్లాసంగా మారుతుంది. ❑

# తలకు నూనె అవసరమే..



**తలకి నూనె రాస్తే ముఖం కూడా జిడ్డుగా మారుతుందనుకుంటాం. అందుకే వీలైనంత దూరం పెడుతుంటాం. కానీ వేడికి జుట్టు కళావిహీనంగా మారుతుంది. పోషణా అందదు. కాబట్టి.. వీలున్నప్పుడల్లా పట్టించేయండి.**

1. వేడికి మాడు నొప్పి వస్తుంది. తలపై చర్మం పొడిబారడం వల్లే ఈ సమస్య. కాబట్టి, కొబ్బరి, బాదం, ఆముదం ఇలా ఏదో ఒక నూనెతో తలకు మసాజ్ చేయాలి. నూనె తలలోకి ఇంకి మాడు చల్లబడుతుంది. హాయిదనం కలుగుతుంది. ఒక గంట తర్వాత తలస్నానం చేస్తే సరి. కుదుళ్లకు కావాల్సిన తేమా అంది, కురులు మృదువుగా మారతాయి.
2. వేగంగా పని ముగుస్తుందని తల అరబెట్టేందుకు డ్రైయర్లు వాడతాం. వాటి పర్యవసానాలు ఏంటో తర్వాత తెలుస్తాయి. వీటి నుంచి వెలువడే వేడికి వెంట్రుకలు గడ్డిలా తయారవుతాయి. అవి తిరిగి జీవం నింపుకోవాలన్నా.. ఆరోగ్యంగా ఎదగాలన్నా కనీసం వారినికోసారైనా నూనెతో మసాజ్ తప్పనిసరి.
3. తలపై చుండ్రుకు చెమట కూడా కారణమే. దీనికి దురద, దద్దుర్లు అదనమై ఇబ్బంది పెడతాయి. ఇలాంటప్పుడు కొద్దిగా వేపనూనెతో మాడుకు మసాజ్ చేస్తే చుండ్రు సమస్య తగ్గటమే కాదు.. ఇతర ఇన్ఫెక్షన్ల నుంచీ విముక్తి.
4. వెంట్రుకల్లో నూనె పాళ్లు తగ్గడం కూడా తెల్లబడటానికి కారణమే. కాస్త వేపాకు, కరివేపాకు వేసి, కాగబెట్టిన నూనెను పట్టించండి. శిరోజాలు నల్లగా నిగనిగలాడతాయి. ఒత్తిడి కూడా తగ్గుతుంది. ❑

# మహిళలకు చిక్కుడు మంచిది



**అన్ని సీజన్లలోనూ దొరికే చిక్కుడు కాయల్ని చాలా మంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇవి మహిళల ఆరోగ్యానికి గట్టి మేలే చేస్తాయి.**

- మనలో చాలా మందిలో ఉండే సమస్య రక్తహీనత. చిక్కుడు ఈ సమస్యను దూరం చేస్తాంది. చిక్కుడులో ఐరన్ అధిక మోతాదు లో లభిస్తుంది. హిమోగ్లోబిన్‌లో ఉండే ఐరన్.. ఆక్సిజన్ రవాణాలో, నిల్వలో కీలక పాత్ర పోషిస్తుంది.
- .కాబోయే తల్లులు తమ ఆహారంలో చిక్కుళ్లకు తప్పక చోటివ్వాలి. వీటిలో అధిక మోతా దులో దొరికే ఫొలేట్.. కణాల ఉత్పత్తి, అవయవ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుంది. తొలి త్రైమాసికంలో ఫొలేట్ సరైన మోతాదులో అందకపోతే న్యూరల్ ట్యూబ్ లోపాలు వస్తాయి. దీనివల్ల శిశువుల్లో మెదడు, వెన్నుపాము ఎదుగుదల సరిగ్గా ఉండదు.
- . దీన్లో ఎక్కువ మోతాదులో ఉండే మెగ్నీషియం, మాంగనీస్, కాపర్.. దంతాలూ, ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఇవి వయోధిక మహిళల్లో ఎముకల సమస్యల్ని దూరం చేస్తాయి.
- చిక్కుడులో విటమిన్ ఇ,కె ఉంటాయి. గాయాలైనపుడు రక్తం గడ్డ కట్టడంలో విటమిన్-కె, ఆక్సిజన్ని తీసుకువెళ్లే ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలో విటమిన్-ఇ సాయపడతాయి.
- పొటాషియం, మెగ్నీషియం, రక్త నాళాలపైన ఒత్తిడి పడకుండా చేసి గుండె ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. చిక్కుడులో ఈ రెండూ అధికంగా ఉంటాయి.
- చిక్కుడులో పీచు పుష్కలంగా ఉంటుంది. జీర్ణక్రియలో ఇది చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పోషకాల గని అయిన చిక్కుడులో క్యాలరీలు మాత్రం చాలా తక్కువ. కాబట్టి బరువు నియంత్రణకీ సాయపడతాయి. అందుకే చిక్కుళ్లను తరచూ మీ ఆహారంలో భాగం చేసుకోండి. ❑

# దేవేంద్ర వైభవం

ఆధ్యాత్మికం



భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులకు నిలయం స్వర్గం. ఆ స్వర్గానికి అధిపతి, దేవతలకురాజు ఇంద్రుడు. అంతటి భోగాలు అనుభవిస్తాడు కనుకనే ఇంద్రభోగాలనే పదం వాడుతుంటాం. ఆ ఇంద్రుడే తూర్పు దిక్కుకు అధిపతి కూడా. అదితి, కశ్యపుల తొలి సంతానం ఇంద్రుడు. వేదాలు, ఉపనిష్నత్తులు, రామాయణ, భారత, భాగవతాల్లో ఇంద్రుడి ప్రస్తావన కనిపిస్తుంది. పూర్వం వర్షాల కోసం ఇంద్రుణ్ణి అర్చించేవారు. అదే ఆయన గర్వానికి కారణమైంది. గోవర్ధనగిరిని ఎత్తి కృష్ణుడు ఇంద్రగర్వాన్ని అణచాడు. ఇంద్రుడు అనేది వ్యక్తి పేరుకాదు. పదివ పేరు. ఇంద్ర పదవిని పొందాలంటే నూరు యజ్ఞా లు చేయాలి. ఒక్కొక్క మన్వంతరంలో ఒక్కొక్కరు ఇంద్రుడుగా ఉన్నట్టు పురాణాలు వివరిస్తున్నాయి. సుశాంతుడు, విబుడు, మనోజవుడు, బలిచక్రవర్తి తదితరులు ఇంద్ర పదవిని అధిష్ఠించారు. ఇంద్రుడికి ప్రత్యేక ఆయుధాలు, అలంకరాలు, అధికారాలు, సౌకర్యాలు, భోగాలు ఉంటాయి. దేవేంద్రుడికి వజ్రాయుధం అనే ఆయుధం, ఐరావతం అనే ఏనుగు, శచీదేవి అనే భార్య, ఉచ్చైశ్రవం అనే గుర్రం ప్రత్యేకంగా ఉంటాయి. ఇంద్రుడు కొలువుదీరిన సభ సుధర్మ, ఆయన రథసారథి మాతలి. ఇంద్రుడి ఉద్యానవనం నందనవనం, ఆయన కుమారుడు జయంతుడు, కుమార్తె జయంతి ప్రతి సంవత్సరం చైత్ర పూర్ణిమ నాడు తమలపాకులు, కొబ్బరికాయతో కలశం పెట్టి ఇంద్రుణ్ణి ఆవాహన తచేసి షోడశోప చారాలతో పూజించడం అనవాయితీ.

# తోట మట్టిలో పోషకాలుండేలా..



మట్టి బలంగా ఉంటేనే మొక్కలకు కావాల్సిన పోషకాలు అంది ఆరోగ్యంగా పెరుగుతాయి. అలాగని రసాయనికి ఎరువులను వాడొద్దు. ఇవి క్రమేపీ మట్టిని బలహీనపరుస్తాయి. పోషకాలు తగ్గి, మట్టి సహజత్వాన్ని కోల్పోతుంది. అలాకాకుండా వ్యర్థాలతోనే మట్టిని పోషకాలమయంగా మార్చుకోవచ్చు.

**ఎరువు తయారీకి :** ఇంటి వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. ఇది మట్టిని పోషకాలమయం చేస్తుంది. మొక్క ఎదుగుదలకు అవసరమయ్యే సూక్ష్మజీవులను అందిస్తుంది. ఓ గొయ్యి తీసి వంటింటి వ్యర్థాలను నింపి ఆకులు, గడ్డితో కప్పాలి. మార్కెట్లో దొరుకుతున్న కంపోస్ట్ బాక్సుని కూడా దీనికి వినియోగించొచ్చు.

**వ్యర్థాలతో :** పాతచెక్క, కార్డ్‌బోర్డు ముక్కలు, రాలిన ఆకులు, కొమ్మలు, కాగితాలను కలిపి కంపోస్ట్ చేయొచ్చు. వంటింటి వ్యర్థాలైన పండ్లు, కూరగాయల తొక్కలు, వడలిక పూలు, కుళ్లిన కాడలు, గడ్డి వంటివన్నీ ఎరువు తయారీకి పనికొస్తాయి. ఇందులో వ్యర్థ ఆహారపదార్థాలు, చీడపట్టిన కొమ్మలు వంటివి మాత్రం కలపకూడదు. గోతిలో వేసిన ఈ చెత్తపై కొంత మట్టికప్పి ఐదారు నెలలపాటు మూసేయాలి. పొడిపొడిగా మారే ఈ మట్టిలో మొక్కలకుకావాల్సిన పోషకాలుంటాయి.

**పెరటి ఎరువు...** కూరగాయల మొక్కల కోసంప్రత్యేకంగా పెరటి ఎరువును తయారు చేసుకోవచ్చు. పేడ, కోడి మాంసం, చేపల వ్యర్థాలు రంపపు పొట్టు, కోడి పెంటను గోతిలో నింపి నీళ్ల చల్లి కప్పి ఉంచాలి. నాలుగైదు వారాల తర్వాత ఇది ఎరువుగా మారుతుంది. దీన్ని మొక్కలు నాటేటప్పుడు వాటి మొదళ్లలో వేస్తే ఇందులోని ఫాస్ఫరస్ ఆరోగ్యంగా ఎదగడానికి తోడ్పడుతుంది. చామంతి, బంతి మొక్కలు సీజన్ తర్వాత వడలిపోతుంటాయి. అటువంటి మొక్కలను తొట్టె నుంచి తీసేసి ఆ మట్టిని పెరట్లో మొక్కల చుట్టూ లేదా ప్లాంట్ బెడ్స్‌కు సరిహద్దులాసర్దినా చాలు పోషకాలు అందుతాయి. ❑

# చెలి చిట్కా



దుస్తుల మీద టమాటా సాస్ పడితే.. ఆ ప్రాంతంలో గ్లిజరిన్, సబ్బు నీళ్ల చల్లి గంటయ్యాక రుద్ది ఉతికితే మరకలు మాయం. ❑

# బీట్‌రూట్ హల్వా

**కావలసినవి :** బీట్‌రూట్-200గ్రాములు, కోవా-50 గ్రాములు, జీడిపప్పు- 15 గ్రాములు, పంచదార-150 గ్రాములు, నెయ్యి - 20 గ్రాములు, ఎండుద్రాక్ష- 10 గ్రాములు, బాదం-10 గ్రాములు, యాలకులు10గ్రాములు.

**తయారీ విధానం :** బీట్‌రూట్ పొట్టు తీసి సన్నగా తరగాలి. స్టవ్‌పై కడాయి పెట్టి నెయ్యి వేసి వేడి అయ్యాక బీట్‌రూట్ తురుము వేసి వేగించాలి. బాగా వేగిన తరువాత పంచదార, కోవా వేసి మరో మూడు నిమిషాల పాటు వేగించుకోవాలి. తరువాత కొన్ని బాదం పలుకుల, జీడిపప్పు, యాలకుల పొడి వేసి మరికాసేపు వేగనివ్వాలి. చివరగా బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్షతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి. ❑



# రానా దగ్గుబాటి 'హిరణ్యకశ్యప'

హీరో రానా దగ్గుబాటి శాండియాగోలో జరుగుతున్న కామిక్ కాన్ ఈవెంట్ వేదికగా తన కొత్త చిత్రం 'హిరణ్యకశ్యప'ని అనౌన్స్ చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా పతాకంపై ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో రూపొందించనున్నారు. ఇందులో రాక్షసరాజు హిరణ్యకశిపునిగా రానా టైటిల్ రోల్ పోషించనున్నారు.. మాటల మాంత్రికుడు, అగ్రదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్



రచనలో ఈచిత్రంలో రూపొందనుంది.. ఈప్రాజెక్టు గురించి త్రివిక్రమ్ మాట్లాడారు. ఈ టైమ్‌లెస్ లెజెండ్స్ కథను ప్రేక్షకులతో పంచుకోవటం గౌరవంగా ఉందన్నారు.. ఈ అద్భుతమైన కథనాన్ని రూపొందించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఈ ఎక్స‌యిట్‌మెంట్‌ని బిగ్‌స్క్రీన్‌పైకి తీసుకురావటం కోసం మేం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని అన్నారు.

# కిరణ్ అబ్బవరం 'రూల్స్ రంజన్' పాట

కిరణ్ అబ్బవరం, నేహాశెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం రూల్స్ రంజన్.. సు ప్రసిద్ధ నిర్మాత ఎఎం రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్నారు. అతి కొద్ది కాలంలోనే యువతకు



ఎంతగానో చేరువైన హీరో,హీరోయిన్లు కిరణ్ అబ్బవరం, నేహాశెట్టి కలయికలో వస్తున్న సినిమా కావటంతో ఈచిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి.. తాజాగా ఈచిత్రం నుంచి రెండో పాటను విడుదలచేశారు.సమ్మోహనుడా... లిరికల్ వీడియోను యూనిట్ గురువారం ఉదయం విడుదలచేసింది.. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన శృంగార గీతమిది... కిరణ్ అబ్బవరం, నేహాశెట్టి మధ్య కెమిస్ట్రీ చక్కగా ఉంది.. ఒకరిపై ఒకరు మోహాన్ని తెలియజేస్తూ నిప్పు, నీరు నేపథ్యంలో పాటను చిత్రీకరించిన తీరు ఆకట్టుకుంది.. సంగీతం చాలా బాగాఉంది.. ఈ పాట విడుదల సందర్భంగా చిత్ర దర్శకుడు రత్నం కృష్ణ మాట్లాడారు. హైదరాబాద్‌లో వేసిన నాలుగు ప్రత్యేక సెట్స్‌లో ఈపాటను చిత్రీకరించినట్టు తెలిపారు. ముంబై, రష్యాకు చెందిన డ్యాన్సర్లు కన్పిస్తారని తెలిపారు. శిరీష్ అనే కొత్త కొరియోగ్రాఫర్ ఈచిత్రంతో ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడని అన్నారు.. వినోదమే ప్రధానంగా ఈచిత్రం ఉంటుందని తెలిపారు.






న్యూ ఫోటో షూట్
మాళవిక మోహనన్

# ఆధ్యాత్మిక ధ్యానంలో..

టాలీవుడ్ బ్యూటీ సమంత రూత్ ప్రభు.. దశాబ్దానికి పైగా దక్షిణాది అభిమానులను అలరిస్తున్నారు.. శాకుంతలం సినిమా జరుగుతుండగా ఆమె కొంత అనారోగ్యానికి లోనయ్యారు.. ఆరోగ్యం ఒకింత సహకరించకపోయినా ఆమె షూటింగ్‌ను త్వరగా పూర్తిచేశారు.. ఆరోగ్యం కుదుట పడటంతో ఆ తర్వాత ఖుషీ, సిటాడెల్ మూవీస్ షూటింగ్ పూర్తిచేశారు..ఆ తర్వాత ఏడాది కాలం పాటు బ్రేక్ తీసుకుంటున్నట్టు ఆమె ప్రకటించారు. అయితే బ్రేక్ సమయంలో ఎక్కువగా ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశారు.ఇపుడు ఆలయాల చుట్టూ తిరుగుతున్నారు. చెన్నైలోని పలు ఆలయాలను సందర్శించి ఫొటోలు ఇపుడు బయటకు వచ్చాయి.. తాజాగా కోయంబత్తూరులో ఈషా ఫౌండేన్‌లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు జగ్గీవాసుదేవ్ నేతృతంలో ఆశ్రయంలో అనేక మందిరితో కలిసి ధ్యానంలో పాల్గొన్నారు.. ఆ ధ్యానానికి సంబంధించిన ఫొటోను ఆమె అభిమానులకు షేర్‌చేశారు. ప్రశాంతత కోసం అక్కడకు ఆమె ఎక్కువుగా వెళ్తున్నట్టు తెలిసింది.



# 'హరోం హర' ఉడిపి షెడ్యూల్ కంప్లీట్

హీరో సుధీర్‌బాబు పాన్ ఇండియా చిత్రం హరోం హర.. సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్వేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి.నాయుడు నిర్మిస్తున్నారు. సుధీర్‌బాబు బర్త్‌డే కానుకగా విడుదలైన హరోం హర ఫస్ట్ ట్రిగ్గర్ గ్లింప్స్‌కు మంచి స్పందన వచ్చింది.. తాజాగా ఈచిత్రం యూనిట్ ఉడిపిలోని కీలక షెడ్యూల్‌ను పూర్తిచేసింది.. షెడ్యూల్ అనంతరం హీరో సుధీర్‌బాబు శ్రీకుక్కే సుబ్రహ్మణయ ఆలయాన్ని దర్శించుకున్న ఫొటోను



అభిమానులతో పంచుకున్నారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈచిత్రానికి పనిచేస్తున్నారు.. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.. ఈ ఏడాది డిసెంబర్22న తెలుగు,తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈచిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# గోపీచంద్ 'భీమా' కీలక సన్నివేశాల చిత్రీకరణ

మాచోస్టార్ గోపీచంద్, ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో చేస్తన్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ భీమా... సక్సెస్‌ఫుల్ బ్యానర్ శ్రీసత్యసాయి ఆర్ట్స్ ప్రొడక్షన్ నెం14గా నిర్మాత కెకె రాధామోహన్ ఈచిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈచిత్రం ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది.. తాజాగా యూని ట్ ఈచిత్రానికి సంబం ధించిన కొన్ని కీలక యా క్షన్ సన్నివేశాల



చిత్రీకరణ పూర్తిచేసింది.. కాకినాడ, రాజానగర్, అద్దరిపేట బీచ్ పరిసరప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.కన్నడలో పలు బ్లాక్‌బస్టర్‌లను అందించిన హర్ష ఈ భారీ బడ్జెట్ చిత్రంతో టాలీవుడ్‌లోని ఎంట్రీ ఇస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, ఇతర అంశాలతో కూడిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా భీమా చిత్రం రాబోతోంది..

# 'హిడింబ' కొత్త అనుభూతి నిస్తుంది

యంగ్ హీరో అశ్విన్‌బాబు హీరోగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో శ్రీ విఘ్నేష్ కార్తీక్ సినిమాస్ బ్యానర్‌పై గంగపట్నం శ్రీధర్ నిర్మించిన హై ఎనర్జిటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హిడింబ'.. నందితా శ్వేత హీరోయిన్‌గా నటిస్తోంది. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్‌సుంకర ఈచిత్రాన్ని సమర్పిస్తున్నారు.. ఈచిత్రం థియేట్రికల్ ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది.. ఈనెల20న విడుదలైన ఈచిత్రం ప్రపంచ వ్యాప్తంగా హిట్‌టాక్ అందుకుంది.. ఈ నేపథ్యంలో హీరో అశ్విన్‌బాబు మీడియాతో మాట్లాడారు..



**ఈ సినిమాకు 'హిడింబ' అనే పేరు పెట్టటానికి కారణం?**

వాస్తవానికైతే ఈ కథకు రాక్షసుడు అనే టైటిల్ కావాలి.. కానీ ఈ పేరుతోసినిమాలు వచ్చాయి.. ఆస్థానంలోమరోపేరు కోసం అన్వేషించినపుడు హిడింబ అనే పేరు అయితే బావుంటుందని భావించాం.. దీని అర్ధం కూడ రాక్షసుడు అనే అర్ధానికి దగ్గరగా ఉంటుంది. దీనికి చారిత్రక నేపథ్యం కూడ ఉంది. సినిమాలో ప్రేక్షకలను యంగేజ్ చేస్తుంది.. ప్రేమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది.. చూసిన అందరూ బాగుందని మెచ్చుకుంటున్నారు.

**దర్శకుడు అనిల్ ఈ కథతో ఎపుడు సంప్రదించారు?**

కరోనా ఫస్ట్ లాక్‌డౌన్ తర్వాత కాల్‌లోనే ఈ కథను చెప్పారు. చాలా నచ్చింది. అయితే అప్పటికే మా నిర్మాత శ్రీధర్‌గారితో ఒక సో ర్ట్స్ సబ్జెక్టు అనుకున్నాం. కానీ కరోనా కారణంగా స్టేడియమ్ స్, పర్మిషన్స్, ఫారిన్ లొకేషన్స్ కుదురుతాయో లేదా? అనే సందేహం ఉండేది... అందరం ఒకే అభిప్రాయానికి వచ్చి హిడింబ కథచేయాలని నిర్ణయించుకున్నా.

**ఈ సినిమా చేసే క్రమంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?**

ముందుగా ఈసినిమా నిర్మాత గంగపట్నం శ్రీధర్‌గారి గురించి చెప్పాలి.. హీరోకి చాలా ప్రాధాన్యత ఇచ్చే నిర్మాత ఆయన. ఆయన గతంలో చేసిన కొన్ని సినిమాలు నిరాశపరిచాయి.. కచ్చితంగా ఈ సినిమాతో ఆయనకు విజయం దక్కిందనే చెప్పాలి.. ఈసినిమాను అత్యున్నతంగా నిర్మించారు.. ఓంకార్ అన్నయ్య ఏది చేసినా కొత్తగా చెయ్..అని చెబుతుంటారు. ఈ రెండు దృష్టిలోపెట్టుకుని ఈసినిమా చేశా.. అందుకే ఈసినిమా పూర్తయ్యేదాకా మరో సినిమా ఒప్పుకోలేదు.

**మీరు ఎంచుకున్న కథల గురించి అన్నయ్యకు చెబుతారా?**

కచ్చితంగా నేను విన్న కథల్లో నాకు నచ్చిన కథలను అనయ్యకు చెబుతాను.. హిడింబ కథను కూడ విన్నారు.. ఆయనకి చాలా నచ్చింది

**అనిల్ సుంకర సపోర్ట్ ఎంతవరకు ఉంది?**

వ్యక్తిగా అనిల్ సుంకరగారి గురించి ఒక మాట చెప్పాలి.. సినిమా పట్ల ఆయనకు ఉన్న అంకితభావం అద్భుతం...రాజీపడకుండా రిలాక్స్ అవ్వకుండా పనిచేస్తుంటారు.. అనిల్‌సుంకర గారి లాంటి ప్రొడ్యూసర్ తెలుగు ఇండస్ట్రీలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. చాలా నిజాయితీగల నిర్మాత..

**కొత్తగా చేయబోయే సినిమాలు?**

మెడికల్ మాఫియా థ్రిల్లర్ నేపథ్యంలో సినిమా ఉంటుంది. అలాగే ఒక స్పోర్ట్స్ డ్రామా కూడ ఉంది.

# హిట్ అవుతుందని ట్రైలర్‌ను చూసినపుడే అనుకున్నా: విశ్వక్‌సేన్

చైతన్యరావ్, లావణ్య జంటగా నటించిన అన్నపూర్ణ ఫొటోస్టూడియో ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్‌కాదాస్ విశ్వక్‌సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. నిర్మాత రాజ్ కందుకూరి ,సింగర్ రఘు కుంచె, రచయిత లక్ష్మీభూపాల కార్యక్రమంలో పాల్గొని టీంకు విషెస్ తెలిపారు. బిగ్‌బెన్ సినిమాస్ పతాకంపై యష్‌రంగినేని నిర్మించారు. ఈచిత్రానికి చెందు ముద్దు దర్శకత్వం వహించారు. ఈచిత్రం ఈనెల 21న విడుదల కానుంది.. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు.. ఏసినిమాను చిన్న సినిమా అనొద్దని అన్నారు.కొత్త వాళ్ల సినిమా అని పిలవండి అని పేర్కొన్నారు.




తాను రావటం వల్ల సినిమాకు మంచి జరిగిగే తప్పకుండా ప్రమోషన్‌కు వస్తానని అన్నారు.అది నాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అన్నపూర్ణ ఫొటో స్టూడియో ట్రైలర్ నచ్చిందని తెలిపారు. ఈసినిమా మీరు ఆశించిన సక్సెస్ అందుకుంటుందని చెప్పారు. హీరో చైతన్య ఇపుడు మంచి సినిమాలు చేస్తున్నాడని, తరుణ్‌భాస్కర్ కీలాకోఆలో నటిస్తున్నాడని అన్నారు. దర్శకుడు చెందు టాలెంటెడ్ పర్సన్ అన్నారు. ఒక ఫ్యామిలీలా ఈసినిమా కోసం అంతా కష్టపడ్డారని అన్నారు. వీరందిరకీ మంచి సక్సెస్ రావాలనికోరుకుంటున్నానని అన్నారు. కార్యక్రమంలో సినిమాటో గ్రాఫర్ పంకజ్, నటి ఉత్తర, నటుడు వైవా రాఘవ, నటుడు లలిత్ ఆదిత్య, గాయకుడు, నటుడు రఘు కుంచె, రచయిత లక్ష్మీ భూపాల, హీరోయిన్ లావణ్య, నిర్మాత రాజ్ కందుకూరి, హీరో చైతన్యరావ్, దర్శకుడు చెందు ముద్దు, దర్శకుడు,రైటర్ కృష్ణచైతన్య, నిర్మాత యష్ రంగినేని తదితరులు మాట్లాడారు.

# విశ్వక్‌సేన్ మూవీ తొలిషెడ్యూల్ కంప్లీట్

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో విశ్వక్‌సేన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తన కొత్త చిత్రాన్ని చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీస్థాయిలో ఈచిత్రాన్ని నిర్మిసుతన్నారు. ఈచిత్రంలో విశ్వక్‌సేన్‌కు జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది.. తాజాగా ఈచిత్రం మొదటి షెడ్యూల్‌ను కంప్లీట్ చేశారు. చిత్ర ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. త్వరలో తదుపరిషెడ్యూల్‌ను యూనిట్ ప్రారంభించనుంది.. మరికొద్ది రోజుల్లో టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈచిత్రం ఫస్ట్‌సింగిల్ లిరికల్ వీడియో కూడ త్వరలో రివీల్ కానుంది.. ఈచిత్రాన్ని జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.. ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈచిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.



# గురువుకు ప్రత్యేక పూజలు హోమాలు:భక్తుల సంబరాలు



**శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త:** చదువుల గురువు గురుదక్షిణామూర్తికి గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తికి నిత్యపూజలు, అభిషేకాలు అలరారుతున్నారు. ఈ సేవల్లో గురువారం పూజలు అభిషేకాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో పూజలు, అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో పరీక్షల కారణంగా భక్తుల సంఖ్య పరిమితంగా ఉంది. దాంతో వచ్చిన వారు సుదర్శనం, సత్వర దర్శనం చేసుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా భక్తులు అంతంతమాత్రంగానే ఉన్నారు.

**విశేషాలంకారాలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు,హోమాలు, అభిషేకాలు ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కాలుమోపిన వారికి తెలియని అనుభూతి కల్గిస్తుంది. ఆలయంలో ప్రవేశించిన వెంటనే బాహ్య ప్రపంచాన్ని మరచి పోతారు. శివయ్య సేవలో తరిస్తారు. అంతటి మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగగా పూజలు నిర్వహించారు. ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది. ఉదయం నుండి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు,పెరుగు,పంచామృతం,చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో,స్వర్ణాభారణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి,కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఎపిఆర్ఓ వెంకటస్వామి,నాగభూషణం నాయక్ స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు.పూజలు,అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారథ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

# లంచాలకు తావు లేకుండా పారదర్శక పాలన

## రాష్ట్రంలో దొంగ ఓట్లపై ప్రభుత్వం సీరియస్ చర్యలు చేపడుతుంది, కుప్పంలో భరత్ గెలవడం ఖాయం: మంత్రి పెద్దిరెడ్డి

**శాంతిపురం, జూలై 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం లంచాలకు తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తోందని ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం శాంతిపురంలో ఏరా ్పటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ప్రసంగించారు. గతంలో ప్రజలు తహాశీల్దార్, మండల కార్యాలయాల చుట్టూ తిరిగే వారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలను ప్రజలకు అందిస్తోందన్నారు. ప్రజలు ఇచ్చిన సమస్యలపై జూలై 31లోపల నూటికి 99శాతం పరిష్కరించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష సేవలు అందించడంలో చిత్తూరు జిల్లా రాష్ట్ర ంలో పదో స్థానంలో ఉందన్నారు. జూలై 1నుంచి చేపట్టిన ఈ కార్యక్రమంకు ప్రజలనుంచి విశేష స్పందన లభిస్తోం దన్నారు. జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో 4,65594, పట్టణ ప్రాంతాల్లో 1,19398 గృహాలు ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో 3,13787, పట్టణ ప్రాంతాల్లో 68772 గృహాల్లో హౌస్ హోల్డ్ సర్వే పూర్తయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,21,974, పట్టణ ప్రాంతాల్లో 24462 మొత్తం 1,46436వినతులు అందాయన్నారు. ఇప్పటివరకు జిల్లా ్లలో 47516 ఆదాయ సర్టిఫికెట్లు, 47287మందికి ఇంటిగ్రేటెడ్, 5786 మొబైల్ అప్‌డేషన్ ఇన్ ఆధార్, రేషన్‌కార్డుల్లో చేర్పులకోసం 1841,ఆర్ఓఆర్ఐబి 928కి సర్టిఫికెట్లు అందించడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పేదలకు ఇబ్బంది లేకుండా సచివాలయాల్లో ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి అవసరాలు ఉన్న వారు గ్రామీణ ప్రాంత సచివాలయాలు, వార్డు సచివాల యాల్లో సిబ్బందిని కలసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కాగా కుప్పంలో ఈసారి భరత్ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని మంత్రి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.కుప్పంలో చంద్రబాబుకు 2004 నుంచి మెజార్టీ తగ్గుతోందని పేర్కొన్నారు.ప్రజల్ని లక్ష ఓట్లు మెజార్టీ అంటూ మభ్య పెడుతున్నారన్నారు. స్థానిక సంస్థలు,కుప్పం మున్సిపాలిటీలను తాము గెలిచామన్నారు. కుప్పానికి చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. వందలాది అర్జీలు ప్రజలు ఎందుకుఇస్తున్నారో అర్థం చేసుకోవాల న్నారు. రెండు నెలల్లో హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి సిఎం జగన్‌చే ప్రారంభిస్తామన్నారు. కుప్పం మున్సిపాలిటీకి60కోట్లు, తాగునీటికి 16 కోట్లు కేటాయించా మన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు పోటీపడి తిట్లపురాణం చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు మీడియా ఉందని గోరం



గురువారం మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తలు కొండంతలు చేయవచ్చని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఉన్న 3.90 కోట్ల ఓట్లలో 60లక్షల దొంగ ఓట్లు చంద్రబాబు హయాంలో చేర్చారని దీనిపై ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.కుప్పంలో సైతం నమోదైన 17వేల దొంగ ఓట్లను తొలగించామని మిగతా ఉన్న సుమారు 24-25వేల ఓట్లను సైతం తొలగిస్తా మన్నారు. దొంగ ఓట్లపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తుం దన్నారు. సమావేశంలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే వెంకటేగౌడ, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జడ్పీవైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డిఎల్‌పిఒ రవికుమార్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, కన్వీనర్ దండపాణి, ఎవిజయరాం, వినోద్‌కుమార్, జగదీష్, భాస్కర్, నిసార్, మురళి, పెద్దన్న పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే 20లక్షల మందికి ఉద్యోగ భృతి: నారా లోకేష్

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు:** 2024లో జరిగే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగ భృతి కల్పించడం జరుగుతుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. గురువారం నారా లోకేష్ యువగళం పాదయాత్ర అశేష జనవాహిణితో అడుగడుగునా మహిళల దీవెనలతో లోకేష్ యువగళం ప్రభంజనం కనిగిరిలోకి అడుగుపెట్టడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారధ్యంలో 15వేల మంది లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో నారా లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగాన్ని నిర్మూలించడం జరుగుతుందని అన్నారు. అన్నదాన సుఖీభవ ద్వారా సంవత్సరానికి రూ.25వేలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. అసభ్యంగా దూషించిన వారిపై కేసు పెట్టవచ్చని అన్నారు. ముస్లింలకు గత ప్రభుత్వంలో రంజాన్ కానుక చంద్రబాబునాయుడు ఇవ్వడం జరిగిందన్నారు. తాము అధికారంలోకి రాగానే ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ గడ్డ చంద్రబాబునాయుడుదని, ప్రభంజనం ఆపడానికి సైకో జగన్ ఎన్నో కుట్రలు పన్నుతున్నారని అన్నారు. సజావుగా సాగనిస్తే పాదయాత్ర అవుతుందని, లేని యెడల వైఎస్సార్‌పార్టీకి అంతిమయాత్ర అవుతుందని



గురువారం పామూరు బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న నారా లోకేష్

అన్నారు. యూనివర్సిటీకి రావాల్సిన రూ.150కోట్లు సైకో జగన్ పక్కదారి మళ్లించడం జరిగిందన్నారు. కేవలం పదోతరగతి తప్పిన జగన్ డబ్బులతో కులం, మతం సర్టిఫికెట్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. లక్షల రూపాయలతో పాదరక్షలు కొనడం, వెయ్యి రూపాయలతో వాటర్ బాటిల్ నీరు ఉపయోగిస్తున్నారంటే సైకో జగన్ స్థాయి ఏ మేరకు వెళ్లిందో ఇట్టే అర్థమవుతుందన్నారు. బెంగుళూరు, వైజాగ్, హైదరాబాద్, తాడేపల్లిలో కోట్ల రూపాయలతో ప్యాలెస్ జీవితం అనుభవిస్తున్న వ్యక్తి పేదవాడు ఎలా అవుతాడని అన్నారు. వంద సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసిన ఏకైక ముఖ్యమంత్రి సైకో జగన్ అన్నారు. టీడీపీలో ఉన్న తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతం వైసీపీకి వెళ్లి ప్రకాశం జిల్లాకు ఏమి ఒరగపెట్టారని అన్నారు. సైకో జగన్ వెలిగొండ ప్రాజెక్టును సంవత్సరంలో పూర్తి చేస్తానని అన్నారు. నడికుడి ప్రాజెక్టును సైకో గాలికి వదిలేశాడని అన్నారు. పన్నులు, కరెంటు ఛార్జీలు పెంచి మైనింగ్ ఇండస్ట్రీని వైసీపీ దెబ్బతీసిందని అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు అతీగతి లేకుండా పోయిందని అన్నారు.గత టీడీపీ అభివృద్ధిచర్చించడానికి తాను సిద్దంగా ఉన్నానని సవాల్ చేశాడు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు వస్తే లోకేష్ సింగల్‌గా రావడం జరుగుతుందని అన్నారు. అసలు విషయానికి వస్తే బుర్రా పాలనలో కనిగిరి అవినీతిలో పేరుకుపోయి మైనింగ్ మాఫియా అయిందని అన్నారు. పేరు మధుసూదన్‌యాదవ్ అయితే ప్రస్తుతం మనిసూధన్‌యాదవ్ అయ్యాడని అన్నారు. నియోజకవర్గంలో మనిసూదన్‌యాదవ్ రూ.10కోట్లు స్కామ్ చేయడం జరిగిందన్నారు. భూకబ్జాలకు అడ్డుపడి సుధాకర్‌ను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఉపాధిలో కుంభకోణం చేసి అగ్రిగోల్డ్, జమాయిల్ కబ్జాకు తలపడటం జరిగిందన్నారు. వెలిగండ్లలో 349/2 సర్వే నెంబరు గల భూమిని మధుసూదన్‌యాదవ్‌తో పాటు ఆయన అనుచరులు కబ్జా చేయడం జరిగిందన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అసైన్డ్ భూమి కబ్జాల్లో భాగంగా రేషన్ బియ్యం స్కామ్ చేస్తున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కిడ్నీ బాధితులకు రక్షణ కల్పిస్తామన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు సంవత్సరానికి రూ.18వేలు పక్రారం ఐదేళ్లలో 90వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం ద్వారా ప్రతి సంవత్సరం రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందని, ఇద్దరికి రూ.30వేలు, ముగ్గురికి రూ.40వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కనిగిరి కష్టాలు తెలిసిన వ్యక్తి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అని, ప్రజల కష్టాలు తెలుసుకుని వెంటనే పలకరిస్తారని నారా లోకేష్ అన్నారు.



# గిరిజన యువకుడిని అన్నివిధాల ఆదుకుంటాం

## బాధితుడిని పరామర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు:** ప్రకాశం జిల్లా ఒంగోలులో దాడికి గురైన గిరిజనుడు మోటా నవీన్‌కు, అతని కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం, రాష్ట్ర ఎస్టీ కమిషన్ అన్ని విధాల అండగా ఉంటుందని ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. బాధితుడిని, అతని కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. దాడికి పాల్పడిన వారికి చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గురువారం ఒంగోలు వచ్చిన వడిత్యా శంకర్ నాయక్‌ను జిల్లా ఎస్పీ మలికాగర్గ్ కలిసి ఈ ఘటనకు సంబందించిన పూర్వాపరాలను వివరించారు. దాడికి పాల్పడిన 9 మందిలో ఆరుగురిని అరెస్టుచేసి, సెక్షన్ 307తో పాటు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు కూడా నమోదుచేసినట్లు తెలిపారు. మిగిలిన నిందితులను అదుపులోకి తీసుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. బాధితుడికి పరామర్శించిన అనంతరం శంకర్‌నాయక్ మాట్లాడుతూ గత నెల 19న ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి, కులం పేరుతో దూషిస్తూ మూత్రం పోసిన అమానవీయ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీనియర్‌గా తీసుకుందన్నారు. నవీన్ పట్ల అమానవీయంగా ప్రవర్తించిన మన్నె రామాంజనేయ చౌదరి, మరో 8మందికి చట్ట ప్రకారం శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని, డిఐజిని ఆదేశించామన్నారు. సోషల్ మీడియాలో ఈ దాడికి సబంధించిన వీడియోను గమనించిన పోలీసు యంత్రాంగం వేగంగా స్పందించి ఆరుగురిని అరెస్టుచేసిందని, మిగతా ముగ్గురిని కూడా త్వరగా అరెస్టు చేయాలని ఎస్పీని ఆదేశించినట్లు శంకర్ నాయక్ తెలిపారు. దోషులకు త్వరగా శిక్ష పడేలాగా ఎస్టీ కమిషన్ చూస్తుందన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి వారి హక్కుల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన చెప్పారు. ప్రత్యేకంగా ఎస్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేయడమే దీనికి నిదర్శమన్నారు. గిరిజనుల పట్ల అమానవీయ సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్‌టి కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయన్నారు. బాధితుడు నూతన జీవితాన్ని ప్రారంభించడానికి కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటామని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టం కింద బాధితునికి పరిహారం త్వరగా వచ్చేలా చూస్తామని శంకర్‌నాయక్ చెప్పారు. బాధితుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఏఎస్‌పి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, డిఎస్‌పి నారాయణ స్వామిరెడ్డి, పలు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ని విచారణలకైనా సిద్ధమే.. ప్రశ్నిస్తూనే ఉంటా: జనసేన అధ్యక్షుడు పవన్

## జనసేనలో చేరిన విశాఖజిల్లా మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

**అమరావతి, జూలై 20, ప్రభాతవార్త:** సై అంటే సై తేల్చుకుందాం.. దేనికైనా నేను రెడీ.. వాలంటీర్ అనే జగన్ సమాంతర వ్యవస్థపై నేను సూటిగా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా 'విచారణకు సిద్ధంగా ఉండాలి' అంటూ జగన్ ప్రభుత్వం జిఒ ఇచ్చిందని, ఇది వైకాపా ప్రభుత్వ పతనానికి మొదటి మెట్టు అని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ హెచ్చరించారు.. నేను ఏదైనా విషయం గురించి మాట్లాడితే ఎలాంటి సమాచారం లేకుండా మాట్లాడనని అన్నారు.. అన్నిరకాలుగా ఆలోచించిన తర్వాతే మాట్లాడతానని చెప్పారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో విశాఖజిల్లా పెందుర్తికి చెందిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు.. వైకాపా విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈసందర్భంగా పవన్‌కళ్యాణ్ రమేష్‌బాబుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. జనసేన పార్టీలో చేరేందుకు వందలాది మంది అభిమానులతో కలిసి విశాఖ నుంచి భారీ ర్యాలీగా రమేష్‌బాబు జనసేన కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. జీవితకాలం పవన్‌కళ్యాణ్‌గారి ఆశయసాధనకు పనిచేస్తానని రమేష్‌బాబుస్పష్టం చేశారు. ఈసందర్భంగా పవన్ మాట్లాడుతూ, రమేష్‌బాబు మాఇంట్లోవ్యక్తి లాంటి వారని, పార్టీలో ఆయనకు సముచిత స్థానం ఉంటుందని అన్నారు. అనంతరం పవన్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. వైకాపా ప్రభుత్వం వాలంటీర్లు అనే సమాంతర వ్యవస్థను నడుపుతూ ప్రజల వ్యక్తిగత డేటాను సేకరించి ఏంచేస్తోందని ప్రశ్నించారు. ఎవరికి ఇస్తోందో అనేదే నా ప్రాథమిక ప్రశ్న అన్నారు. వాలంటీర్లు సేకరిస్తున్న 23 అంశాల ప్రాతిపదికల మాత్రమే సమాచారం బయటకు వెళ్తుందనుకుంటే పొరపాటే అని .. అధికారికంగా 23 అంశల వారీగా వాలంటీర్లు సమాచారం సేకరిస్తుంటే.. అనధికారికంగా ప్రజల వ్యక్తిగత విషయాలన్నీ వారు తెలుసుకుంటున్నారని అన్నారు. వారి పరిధిలోని ఇళ్లలోకి చాలా డీప్‌గా వెళ్తున్నారు. ఏంచేస్తున్నారు? వారి కుటుంబ పరిస్థితులు ఏంటీ అన్న ప్రతివిషయాన్ని అనధికారకింగా తెలుసుకుంటున్నారని అన్నారు. అలా తెలుసుకుంటున్న డేటా ఎక్కడికి, ఎవరి వద్దకు వెళ్తోందన్నదే అసలైన ప్రమాదానికి కారణం అన్నారు. హైదరాబాద్ నానక్ రాంగూడలోని ఎఫ్ఓఏ కంపెనీకి ఎందుకు ఈ డాటా వెళ్తోందని ప్రశ్నించారు.

**అమిత్‌షాతో సమావేశం..రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకం:** రెండు రోజుల ఢిల్లీ పర్యటన అద్భుతంగా సాగిందని పవన్ తెలిపారు. పెద్దలు అమిత్‌షాతో సమావేశం చక్కగా సాగిందన్నారు. అంధ్రప్రదేశ్ అభివృద్ధిపై పూర్తిస్థాయిలో రాష్ట్రాన్నిఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై చర్చించామన్నారు. ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం బలమైన నిర్ణయం త్వరలోనే ఉంటుందన్నారు. దీనిపై ఓ స్పష్టమైన విధాన నిర్ణయం వస్తుందన్నారు. ఇది కచ్చితంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్నివిధాలా మేలుచేసేలా ఉంటుందని చెప్పారు. బిజెపి జాతీయ నాయకులతోనూ, ప్రధాని మోడీతోనూ ఉన్న సత్సంబంధాలు చాలా గొప్పగా ఉంటాయని, వారికి పవన్‌కల్యాణ్ దేనికోసంఆలోచిస్తాడనేది తెలుసు అని అన్నారు. నా ఆలోచన ఎపుడూ రా ష్ట్రం, దేశంకోసం ఉంటుందని వారికి నమ్మకం అన్నారు..

**జగన్ పోవాలి ఎన్డీయే ప్రభుత్వం రావాలి:** నను ్నఢిల్లీలోనూ విలేకరులు సిఎం అభ్యర్థి మీరేనా?అని అడిగారని, నేను చెప్పిందొక్కటే అని, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి, అప్పులులేని ఆంధ్రను సాధించేందుకు నేను శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పినట్టు తెలిపారు. పరివర్తన తీసుకొచ్చే రాజకీయాలు నేను చేస్తానని, ప్రజలను చైతన్యవంతం చేసే రాజకీయాలే నా లక్ష్యం అని చెప్పినట్టు తెలిపారు. జగన్‌ను ఇంటికి పంపించే రోజు దగ్గర్లోనే ఉందని, కుదిరితే ఇంటికి పంపిద్దాం లేదా చర ్లపల్లి జైలుకి పంపిద్దామని అన్నారు. రాబోయే ప్రభుత్వంలో కచ్చితంగా జనసేన పార్టీ ముద్ర బలంగాఉంటుందన్నారు. ఓ వాలంటీర్ కన్నీటిగాథ కారణంగానే 'జనవాణి' మొదలైందని అన్నారు. రాష్ట్రంలోని ఎన్నో సమస్యలు మా



దృష్టికి వచ్చాయని, జగన్ పాములాంటి వారని అవసరం అయితే తన పిల్లలను తాను తినే అనకొండ అనేది వాలంటీర్లు గుర్తుంచుకోవాలన్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ, రాష్ట్రానికి పట్టిన గ్రహణం వైకాపా అన్నారు.. అలాంటి వైకాపా నుంచి విముక్తిచెందే ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రజల కోసం, రాష్ట్రం కోసం అంకితమవ్వటానికి జనసేన పార్టీలోకి వచ్చిన పంచకర్ల రమేష్‌బాబును పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

# పక్షపాతం లేకుండా అన్ని వర్గాల వారికి మేలు

## ప్రభుత్వ విప్ సామినేని

**జగ్గయ్యపేట, జూలై 20, ప్రభాతవార్త :** గత తెలుగుదేశం ప్రభుత్వంలా కాకుండా ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజల నుండి కృతజ్ఞతాభినందనలు లభిస్తున్నాయని ప్రభుత్వవిప్, ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని 13, 14 వార్డులు గల 8వ సచివాలయం పరిధిలో శ్రీరంగనాయక స్వామి దేవాలయ వీధిలో గురువారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో విప్ ఉదయభాను పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలోని జన్మభూమి కమిటీల వారికి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు దాఖలుచేస్తే వారు కేవలం పచ్చచొక్కా వారికి మాత్రమే సంక్షేమ పథకాలను అందిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడేవారని, నేడు ఎలాంటి అవినీతి, అవకతవకలు లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందన్నారు.

కార్యక్రమాల్లో మాజీ కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హాఫీజున్నీసా ఫిరోజ్‌ఖాన్, నాయకులు తుమ్మేపల్లి నరేంద్రరావు, బత్తుల రామారావు, బాజీ, భవానీప్రసాదు, లాహోరి బద్దునాయక్, కె కిషోర్, నాగే ంద్ర, రామకృష్ణ, మునిని రాజ్యలక్ష్మి ్మ, గింజుపల్లి వెంకట్రామయ్య, గొల్లపూడి ముక్తే ్యశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ సారె సమర్పణలో పలువురు ప్రముఖులు

## భక్తుల దాహార్తికి వాటర్ కూలర్ వితరణ

**ఇంద్రకీలాద్రి, జులై 20, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని దుర్గమ్మకు సారె సమర్పించుకొనుటకు టిటిడి టెక్నికల్ అడ్వైజర్ నాగం అమర్, మేనేజర్ సందీప్ రెడ్డి, ఫుడ్ కార్పోరేషన్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, విజయవాడకు చెందిన పలు బృందాలు రాగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు చింతా సింహాచలం, టి.వేదకుమారి'లు వారిని స్వాగతించి, సారె సమర్పణ, పూజలు, స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితుల వేదాశీర్వచనం, ప్రసాదము శేషవస్త్రము అందచేశారు.

**ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానమునకు రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ మరియు సెక్రటరీ ఎస్ సత్యనారాయణ రాగా ఆలయాధికారులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితుల వేదాశీర్వచనం, ప్రసాదము శేషవస్త్రము అందచేశారు.

**ఆలయానికి విరాళాలు :** కనకదుర్గమ్మ సన్నిధిలోని నిత్యాన్నదాన పథకానికి విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన పాంచాలవరపు కామేశ్వర శర్మ, నాగలక్ష్మి'లు రూ.1,11,116/-లు విరాళాన్ని ఆలయాధికారులకు అందచేశారు. అలాగే వుంటుర్‌పల్లి అనిల్ శేష్ కుమార్, నీత'లు ఆలయంలో భక్తుల మంచినీటి సౌకర్యార్థం 150లీటర్ల సామర్థ్యం గల వాటర్ కూలర్‌ను ఆలయ ఈవో దర్భముళ్ల భ్రమరాంబ, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, ప్రధానార్చకులు బద్రీనాద్ బాబు'లకు అందచేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, దర్శనానంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మొమెంటోలను అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.





టిటిడి టెక్నికల్, ఫుడ్ కార్పోరేషన్, విజయవాడ పలుబృందాల సారె సమర్పణ,: దేవదాయ శాఖ కమిషనర్, సెక్రటరీలను స్వాగతిస్తున్న ఆలయాధికారులు

## ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై

# ఆగస్టు7న జీవో

## విద్యామంత్రి బొత్స సత్యనారాయణ

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఆగస్టు7న జీవో ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యామంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.ఒప్పంద ఉద్యోగులు క్రమబద్ధీకరణకు సంబంధించిన మార్గదర్శకాలు ఉత్తర్వుల్లో జారీ చేస్తామని తెలిపారు.కొత్త జిల్లా జోనల్ వ్యవస్థ,ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం బేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.జోనల్ వ్యవస్థ ఏర్పాటు తుది దశలో ఉందని వివరించారు.అవసరమైతే ఉద్యోగ సంఘాలను ఈ విషయమై సంప్రదిస్తామని తెలిపారు.ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటుగా త్వరలోనే కారుణ ్య నియామకాలను చేపడతామని తెలిపారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే కార్యచరన, పూర్తి కావొచ్చిందన్నారు.ఉద్యోగుల వేతనాలకు సంబందించి 12వ పీఆర్సీ నియమించామన్నారు.ఉద్యోగుల డిమాండ్లన్ని పరిష్కరిస్తామన్నారు. జీపీఎస్ ఫించన్ విధానం ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.పాత పెన్షన్ విధానం కంటే కుడా ఇది మెరుగైన రీతిలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామన్నారు.ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి బకాయిలు లేకుండాచర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావడం ఉద్యోగ సంఘాల పని అన్నారు.

## సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ.. ఆగస్టు 28కి వాయిదా

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** ఓటుకు నోటు కేసు విచారణ ఆగస్టు 28కి వాయిదా వేసినట్లు జస్టిస్ సంజీవ్‌ఖన్నా,జస్టిస్ బేలా ఎం. త్రివేది సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసుపై గురువారం న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఓటుకు నోటు వ్యవహారంపై రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటీషన్ ఆగస్టు28కి వాయిదా వేశారు.

# భారత్ బ్యాటర్లతో విండీస్‌కు వణుకు



**ట్రినిడాడ్:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత జట్టు ధాటిగా ఆడుతోంది. ట్రినిడాడ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభం అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ ధనాధన్ ఆటతో జట్టును ముందుండి నడిపించాడు. ఈ క్రమంలో వేగంగా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత కొంత సంయమనం పాటించాడు. అదే సమయంలో కుర్ర ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా జోరుగా ఆడాడు. వీళ్లిద్దరూ వన్డే తరహా బ్యాటింగ్‌తో జట్టుకు మంచి స్కోరు అందించారు.

దీంతో తొలి ఇన్నింగ్స్ లంచ్ సమయానికి భారత జట్టు వికెట్లేమీ కోల్పోకుండా 125 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ 63 పరుగులు చేశాడు. వీళ్లిద్దరూ కూడా భారత్‌కు తొలి రోజే భారీ స్కోరు అందించాలని ఆడుతున్నారు. ఓవర్‌కు సుమారు 5 పరుగుల రన్ రేట్ మెయింటైన్ చేశారీ భారత ఓపెనర్లు. ఇలాగే వీళ్ల ఇన్నింగ్స్ కొనసాగితే భారత్‌కు తొలిరోజు భారీ స్కోరు చేయడం ఖాయం.

పిచ్‌పై కొంత తేమ ఉందని, దాన్ని ఉపయోగించుకోవాలనే ముందుగా బౌలింగ్ ఎంచుకున్నామని టాస్ సమయంలో విండీస్ కెప్టెన్ బ్రాత్‌వైట్ చెప్పాడు. కానీ రోహిత్, జైస్వాల్ బ్యాటింగ్ చూస్తుంటే అలాంటిదేం లేనట్లే కనిపిస్తోంది. విండీస్ బౌలర్లు వీరిపై ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. అడపా దడపా బౌలర్లు మంచి స్వింగ్ పొందినా దాన్ని రోహిత్, జైస్వాల్ ఇద్దరూ ఈజీగానే హ్యాండిల్ చేయగలిగారు. దీంతో విండీస్‌బౌలర్లు పూర్తి డిఫెన్స్‌లో పడిపోయారు. అయితే మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉండటం వల్లనే భారత ఓపెనర్లు ఇలా ధాటిగా ఆడుతున్నట్లు కొందరు చెప్తున్నారు. వర్షం వల్ల మ్యాచ్ కుదించినా సరే విజయమే లక్ష్యంగా భారత్ ఆడుతోందని నిపుణుల అంచనా.

## వాణిజ్యం

### ఐపిఒకు యథార్త్ హాస్పిటల్స్

**ముంబై, జులై 20:** గతంలో మార్కెట్లోకి వచ్చిన ఐపిఒల్లో షేర్లు నిరాశకు గురైన ఇన్వెస్టర్లకు మరో సదవకాశం రాబోతోంది. వచ్చే వారం నుంచి మరో కంపెనీ ఐపిఒ మార్కెట్లోకి వస్తోంది. జులై 26 నుంచి యథార్త్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ లిమిటెడ్ మూల ధన సేకరణ కోసం మార్కెట్లోకి వస్తోంది. ఇందులో ఇన్వెస్టర్లు జులై 28 వరకు పెట్టుబడులు పెట్టవచ్చు. తాజాగా కంపెనీ ఐపిఒ కోసం ఈక్విటీ షేర్లకు ప్రైస్ బ్యాండ్ రూ.285 నుంచి రూ.300గా నిర్ణయిం చింది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం ఐపిఒ జులై 25న ప్రారంభమవుతుంది. ఐపిఒలో రూ.490 కోట్ల విలువైన తాజా షేర్లు ఉన్నాయి. దీనికి తోడు ప్రమోటర్లు విమల, ప్రేమ్ నారాయణ్, నీనా త్యాగి ద్వారా 65.51 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంచడం జరుగుతోంది. తాజా ఐపిఒద్వారావచ్చే మొత్తాన్ని కంపెనీ రుణాల చెల్లింపుకు వినియోగించాలని చూస్తోంది. అలాగే రోజువారీ అవసరాలకు విని యోగించనుంది. సంస్థకు నోయిడాలో ఆసుప త్రులున్నాయి. ప్రీ ఐపిఒ ప్లేస్‌మెంట్ రూపంలో 40 లక్షల ఈక్విటీ షేర్లను రూ.300 చొప్పున విక్రయించి కంపెనీ ఇప్పటికే రూ.120 కోట్లను సేకరించింది. ప్రస్తుతం ఇష్యూపరిమాణం రూ.610కోట్ల నుంచి రూ.490 కోట్లకు తగ్గింది.

### చాట్‌జిపిటికి పోటీగా
## యాపిల్‌జిపిటి!

**వాషింగ్టన్, జులై 20:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై మరో టెక్ దిగ్గజం దృష్టిసారిం చింది. ఇప్పటికే మైక్రో సాఫ్ట్, గూగుల్, మెటా వంటి సంస్థలు ఏఐ విషయంలో ముందడుగు వేయగా, తాజాగా ఆపిల్ కూడా సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై దృష్టిసారించింది. చాట్‌జిపిటి, గూగుల్ బార్డ్ తరహాలో ఏఐ చాట్‌బాట్‌ను ఆపిల్ సిద్ధం చేస్తున్నట్లు కూడా ఒక నివేదిక వెల్లడించింది. ఏఐపై ఆపిల్ పనిచేస్తోందన్న వార్తల నేపథ్యంలో ఆపిల్ షేర్లు రెండు శాతం మేర పెరగ్గా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు ఒక శాతం మేర క్షీణించాయి. అజక్స్ అనే లాంగ్వేజ్ మోడల్‌తో చాట్‌జిపిటి తరహాలో చాట్‌బాట్‌ను ఆపిల్ ఇంజినీర్లు పరీక్షిస్తున్నట్లు తెలిసింది. అంతర్గతంగా దీనికి 'ఆపిల్ జిపిటి'గా నామకరణం చేశారు. ఇందుకోసం పలు బృందాలు పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆపిల్ అభివృద్ధి చేస్తున్న ఈ వర్చువల్ అసిస్టెంట్ చాట్‌జిపిటి, బార్డ్ తరహాలోనే టెక్స్ట్‌కు ఆన్సర్ ఇస్తుంది. ప్రస్తుతానికి అంతర్గతంగా ప్రొడక్ట్ ప్రోటోటైపింగ్ కోసం దీన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఆపిల్ అధికారికంగా స్పందించలేదు. ఏఐ గురించి పెద్దఎత్తున బజ్ క్రియేట్ అవ్వడంతోనే అల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఈ విషయం లో కీలక ముందడుగు వేశాయి. ఆపిల్ మాత్రం ఏఐ గురించి కనీసం ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే ఆపిల్ ఇప్పటికే ఆపిల్ ఫోటోస్, డివైజ్ టెక్స్ టింగ్, ఇటీవల తీసుకొచ్చిన మిక్స్‌డ్ రియాలిటీ హెడ్‌సెట్ 'విజన్ ప్రో' విషయంలో ఏఐని వినియో గిస్తూ వస్తోంది. వాయిస్ అసిస్టెంట్ 'సిరి' కూడా ఈ కోవకు చెందినదే. అయితే మిగిలిన కంపెనీలతో పోలిస్తే కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఆపిల్ వెనకబడి ఉందన్న విశ్లేషణలు వినవస్తున్నాయి. ఈ క్రమంలో ఆపిల్ కూడా ఏఐపై పనిచేస్తోందన్న విషయం బయటకు వచ్చింది.









Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.